గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక

# జనవరి 2015
# కథలు




“బ్లాక్ కి బ్రాండ్ అంబాసిడర్ లా ఉంది.

ఏ నెరోలాక్ పెయింట్స్ కో, ఏషియన్ పెయింట్స్ కో లేక ఐటెక్స్ కాటుక కంపెనీకో తెలిస్తే టెండర్స్ లేకుండానే తన్నుకొని ఎవరు గెలిస్తే వాళ్ళు తీసుకెళ్లిపోతారు ఈ ప్రోడక్ట్ ని ....

వంద ఎకరాల చెరువులోనైనా సరే ఒక్కసారి ముంచి లేపామంటే ఇక ఆ నీళ్ళన్నీ బ్లాకైపోతాయి...

యమునా ఎందుకే నువ్వు ఇంత నలుపెక్కినావు రేయి కిట్టయ్యతోటి కూ... డా...వా... అన్నట్టు

ఏమి బ్లాక్ రా! బాబు... ఇంతటి నలుపుని నేను ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు...

చీకటికి చిరునామాలా ఉంది... నిశీధికి నియరెస్ట్ లా ఉంది... అంధకారానికి ఆప్తులన్నట్టుంది...

బొగ్గుల్ని రాశిగా వేసినట్టు... మినుమిల్ని కుప్పగా పోసినట్టు... నల్లద్రాక్షల్ని నిండుగా చూసినట్టు...

మొత్తం మీద 'రేయి కిట్టయ్యతో కూడిన యమునా నది' ఎగసినట్టు ... అబ్బో..., బ్లాక్ కి బంధువులా ఉంది.

ఒక కన్ను కాటికి చూస్తున్నట్టు... ఒక కన్ను ఏటికి చూస్తున్నట్టు... ఏమి నయన సౌందర్యమో, ఏమి నయనానందమో...

నవ్వితే చాలు కనీసం నలుగురైనా చస్తారనడంలో ఆశ్చర్యం లేదు...

ఆ నవ్వు గన్నేరు పువ్వు, ఆ నవ్వు నరకాన వేసే కెవ్వు ...

తక్కువలో తక్కువ పంటికీ పంటికీ పదికిలోమీటర్ల దూరం...

ఆ ఫిల్ ఇన్ ద బ్లాంక్స్ ఫిల్ చేయడానికి డెంటిస్ట్ లు పనిచేయరు... ఏ రాంకీ కన్ స్ట్రక్షన్స్ కో కాంట్రాక్ట్ ఇవ్వాలి....

అన్నింటినీ మించి ఎండిపోయిన తామరాకుల్లా ఉన్న శరీర సౌష్టవం...

వెరసి... నా జీవితంలో నేను చూసిన అత్యంత అందవిహీనమైన ప్రాణి... జీవి... తనే...

ఇలాంటి వాళ్ళకు కూడా పెళ్లవుతుందా...!? ఎవరికి రాసి పెట్టిఉందో ... మహానుభావుడు ... ప్రపంచంలో వాడికంటే దురదృష్టవంతుడు

ఇంకెవరూ ఉండరు. అప్పుడు ఈమెకంటే అదృష్టవంతులు ఇంకెవరూ ఉండరు..."

*****

"నిరంజన్ కి ఒళ్ళంతా చెమట్లు పడుతున్నాయి... కాళ్ళు వణుకుతున్నాయి... మంచినీళ్లు నోట్లో పోసుకోవాల్సింది ఒంటి మీద పోసుకున్నాడు. షర్టంతా తడిసిపోయింది. పక్కన ఎవరితోనూ మాట్లాడలేకపోతున్నాడు... ఓ... బస్ లో నాన్ స్టాప్ గా వాగినవాడు కాలేజ్ క్యాంపస్ లో ఆవిడ ప్రిన్సిపల్ తో మాట్లాడుతుంటే ఏం జరుగుతుందా అని నోరెల్లబెట్టి చూస్తున్నాడు. బస్ లో ఆవిడను కామెంట్ చేసినందుకు ప్రిన్సిపల్ కి కంప్లైంట్ ఇస్తుందని, ఈ రోజు నీ పని అయిపోయినట్టేనని ఫ్రెండ్స్ ఇంకా భయపెడుతున్నారు. వాడి భయానికి తగ్గట్టు ప్రిన్సిపల్ ఆవిడను తీసుకొని నిరంజన్ క్లాస్ వైపే వస్తుంది. ఆవిడ అసలే చండశాసనురాలు... అమ్మాయిలవైపు తలెత్తి చూడాలంటే అక్కడి అబ్బాయిలకు అది జీవన్మరణ సమస్య... పొరపాటున మాట్లాడారంటే వాడి నెత్తిన వాడు యాసిడ్ పోసుకున్నట్టే... లేదంటే వాడికి వాడే యావజ్జీవ కారాగార శిక్ష వేసుకున్నట్టే... లేదంటే ఉరిశిక్ష.... అలాంటిది ఒక అమ్మాయిని కామెంట్ చేయడం... జరగబోయే పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించడానికి కూడా కష్టంగా ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ఆలోచన కూడా నిరంజన్ దరిదాపులకి రావడం లేదు..."

*****

"గుడ్ మార్నింగ్ మేమ్..."

"వెరీ గుడ్ మార్నింగ్"

"షి ఈజ్ నిస్సీ"

"షి ఈజ్ ఫ్రం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, అపాయింటెడ్ ఫర్ మోరల్ క్లాసెస్..."

"మీలో ఆత్మ విశ్వాసాన్ని పెంచడానికి, మీలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి, మీకు ఆత్మ విమర్శను పరిచయంచేయడానికి, ఆత్మాభిమానానికి అర్థం చెప్పడానికి ఆవిడ ఇక్కడ అపాయింట్ చేయబడ్డారు. శ్రద్ధగా నేర్చుకోండి... మిమ్మల్ని మీరు మార్చుకోండి. ఆల్ ది బెస్ట్..."

“థాంక్యూ మేమ్…”

*****

“నా పేరు నిస్సి…”

“నాట్ నిశ”

“నిశ మీన్స్ చీకటి … నిస్సి మీన్స్ విజయం …. సో… ఐ యామ్ నిస్సి. నేను యూనివర్సిటీ ఆఫ్ హైదారాబాద్ నుంచి సైకాలజీలో పిహెచ్.డి చేశాను”

“వాళ్ళతో మాట్లాడుతూనే ఆవిడ నిరంజన్ ని గమనించింది. తనను చూడగానే తన పరిస్థితిని అర్థం చేసుకుంది. అందుకే తను చేసిన తప్పు తానే తప్పని తెలుసుకునేలా, తనలో ఉన్న భయాన్ని పోగొట్టేలా మాట్లాడాలను కుంది.”

నేను ముందుగా మీతో మాట్లాడాలనుకునే మొదటి అంశం ‘కామెంట్స్…’ ”

“నిరంజన్ కి ఏదో అర్థమవుతున్నట్టుంది… కానీ ఏమి అర్థం కావడం లేదు…. కాని ఒకటి మాత్రం నిజం అనుకున్నాడు. తను ఇప్పుడు తన గురించే చెప్పబోతున్నదని, తన పరువు పోవడం ఖాయమని…”

“ఏ వయసులో చేయాల్సిన పనిని ఆ వయసులోనే చేయాలని మన పెద్దలు అంటుంటారు. ఈ వయసులో మనం అంటే మీరు చేయాల్సిన పని కామెంట్ చేయడం… కామెంట్స్ చాలా బావుంటాయి. ఎంత వరకు బావుంటా యంటే అవతలి వాళ్ళు ఇబ్బంది పడనంత వరకు బావుంటాయి. అవతలి వాళ్ళు ఇబ్బంది పడుతున్నా మనం కామెంట్ చేస్తూనే ఉంటే అదే ర్యాగింగ్ గా మారుతుంది… అదే ‘నువ్వు మనిషివి’ అనే సంగతి నువ్వు మరిచిపోయేలా చేస్తుంది. అప్పుడు మీకది తప్పని అర్థం కాదు. కాని మీరు కామెంట్ చేసిన వాళ్ళు మీకు ఎదురైతే, ఎదురుతిరిగితే, మీకు కావలసిన వాళ్లైతే, మీరు కలిసుండాల్సిన వాళ్లైతే అప్పుడు మిమ్మల్ని మీరు ‘ఆత్మవిమర్శ’ చేసుకుంటే అర్థమవుతుంది. మీరు చేసింది తప్పా? ఒప్పా? అనే విషయం. సాధారణంగా నన్ను నాముందు, నావెనుక, నాకు తెలిసి, నాకు తెలియకుండా ఎంతో మంది కామెంట్ చేస్తుంటారు. నేను

ఏరోజూ నాలో ఉన్న 'ఆత్మస్థైర్యాన్ని' కోల్పోలేదు. ఇంకా సంతోషపడ్డాను, ఎందు కంటే నన్ను కామెంట్ చేసుకుంటూ ఎంతో మంది సంతోషపడుతున్నారు, నవ్వుకుంటున్నారు. నారూపం, నారంగు నా చుట్టూ ఉన్న వాళ్ళను నవ్విస్తున్నందుకు సంతోషపడుతున్నాను. ఆ తరువాత ఎప్పుడైనా నన్ను కామెంట్ చేసిన వాళ్ళు కనిపించినా, ఎదురుపడినా నేను ఏ మాత్రమూ వాళ్ళను నిలదీయను. ఇబ్బంది పెట్టను. ఎందుకంటే 'గతం గుర్తు చేసుకుంటే వర్తమానం బాధిస్తుందేమో.... భవిష్యత్తును శాసిస్తుందేమో...'"

"నిరంజన్ ఇప్పుడు మామూలు స్థితికి వచ్చాడు..."

"మీకు ఇంకో విషయం తెలుసా? నేను ఎక్కడ పుట్టానో నాకు తెలియదు... కానీ ఊహ తెలిసిన దగ్గరనుంచి మథర్ థెరీసా అనాథ శరణాలయంలోనే పెరిగాను. అక్కడ ఉండే చదువుకున్నాను. ఆవిడే నాకు మథర్... ఫాదర్... అన్నీ ... నాకు ఎవరూ లేరని, ఒంటరి దానినని నేను ఏరోజూ అనుకోలేదు. నాలాంటి వాళ్లెందరో ఈ లోకంలో ఉన్నారు వాళ్ళంతా నా వాళ్లనుకున్నాను. ఏరోజూ 'ఆత్మవిశ్వాసాన్ని' కోల్పోలేదు. సంకల్పం గొప్పదైతే అదే ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని నమ్మాను. కందుకూరి, గురజాడ, సోక్రటీస్, న్యూటన్, శ్రీనివాస రామానుజన్, జగదీశ్ చంద్రబోస్, ఎల్లాప్రగడ సుబ్బారావ్, అబ్రహాంలింకన్, అంబేడ్కర్... ఇలా ఎంతో మంది వాళ్ళు చేరాలనుకున్న లక్ష్యాలను చేరే క్రమంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదురైనా ఎక్కడా రాజీ పడలేదు, ఆత్మ విశ్వాసాన్ని కోల్పోలేదు. వాళ్ళు అందంగా ఉంటారా? అందవిహీనంగా ఉంటారా? అని చూడలేదు సమాజం వాళ్ళలో ఉన్న ప్రతిభను మాత్రమే చూసింది. కాబట్టి చదువుకోవడానికి, ఎదగడానికి అందం అవసరమే కానీ అది శారీరక అందం కాదు మానసిక అందం, మనసు అందం అదే మనిషికి అందం... ఆ అందం మీలో ఉందా? అయితే మీరు కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తారేమో..."

ఈ నేపథ్యంలో మీకో విషయం చెప్పాలి.... నన్ను కామెంట్ చేస్తూ ఓ అబ్బాయి వాడిన పదాలు ఎంతబాగున్నాయంటే... అతను కొంచెం మనసు పెడితే మంచి కవిలా మారిపోతాడు...

"చీకటికి చిరునామాలా ఉంది... నిశీధికి నియరెస్ట్ లా ఉంది... అంధకారానికి ఆప్తులన్నట్టుంది...

బొగ్గుల్ని రాశిగా వేసినట్టు... మినుముల్ని కుప్పగా పోసినట్టు... నల్లద్రాక్షల్ని నిండుగా చూసినట్టు..." చూసారా ఎంత బాగున్నాయో.... నిజానికి అమ్మాయి కానీ అబ్బాయి కానీ ఎంత అందంగా ఉన్నా వాళ్ళ జుట్టు ఎంత నల్లగా ఉంటే వాళ్ళ అందం అంతగా ఇనుమడిస్తుంది... అంతేకాదు నల్లగా ఉన్న కళ్లే అందంగా ఉంటాయి ... పగలు కూడా చందమామ ఉంటుంది కానీ నల్లని చీకట్లోనే మనకది కనిపిస్తుంది... 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి' అని అబ్దుల్ కలాం అన్న ఆ అందమైన కలలు కూడా నల్లని చీకట్లోనే వస్తాయి... నల్లని నిశీధిలోని భయం... నల్లని చీకట్లోని ప్రేమ... నీ

వాళ్ళను నీకు మరింత దగ్గర చేస్తుంది…‘చీకటి మనకు చిరునామా కాకపోవచ్చు కానీ చీకటికి మనమే చిరునామా…’

‘నిశీధికి మనం నియరెస్ట్ కాకపోవచ్చు కానీ నిశీధి మనకు ఎప్పుడూ నియర్ గానే ఉంటుంది…’

‘అంధకారానికి మనం ఆప్తులం కాకపోవచ్చు కానీ ఒకరికొకరు ఆప్తులమై కూడా అంధకారానికి అవకాశం ఇస్తున్నాం’

‘బొగ్గుల రాశిగా మనం ఉన్నా అదికాలితే వెలుగిస్తుందని, అది నల్ల బంగారమని… అనే విషయాన్ని మరిచిపోతున్నాం…’

‘మినుములకుప్పగా మనమున్నా, నల్లనిద్రాక్షలా మనమున్నా వాటి వల్ల పొందే ప్రయోజనాలని మాత్రం విస్మరి స్తున్నాం…’ వాటితో మనల్ని పోల్చుకుంటూ వాటి విలువని దిగజారుస్తున్నాం…

“నల్లని రంగులలోనైనా…. పైపైన కనిపించే హంగులలోనైనా… మనకు తెలియని విషయాలు ఎన్నో ఉంటాయి. అలా మనకు తెలియనిది తెలుసుకునే విషయంలో చిన్నవారినైనా గౌరవించాలి, చిన్నవారిని ఆదర్శంగా తీసుకొనైనా అడుగులు ముందుకువేయాలి, ఎంత మాత్రమూ ఆలోచించాల్సిన అవసరమూ లేదు… సహాయం పొందాల్సి వస్తే మొహమాటాలు, ‘ఆత్మాభిమానం’ అంటూ కుంచించుకుపోవలసిన అవసరం అంతకన్నా లేదు. ‘మన దగ్గర లేని దానిని మన వాళ్ళ దగ్గర నుంచి పొందడానికి ఆలోచిస్తూ కూర్చుంటే కాలం కూడా నీతో పాటు ఆగిపోదనే విషయాన్ని గుర్తుచేసుకోండి…’

అంత గొప్ప పదాలను వాడి నన్ను కామెంట్ చేసిన ఆ అబ్బాయిని తిడుతూ కూర్చుంటే నేను ఇప్పుడు ఆ పదాల గురించి, తనకు తెలియకుండా తను వాడిన కవిత్వాన్ని గురించి ఇంత గొప్పగా చెప్పేదానిని కాదేమో … కాబట్టి జీవితంలో ప్రతిదానిని పాజిటివ్ కోణం నుంచి చూడడానికి ప్రయత్నించండి… జరిగేదంతా మంచికోసమే అనుకోండి… అప్పుడే ఏదైనా సాధించగల సత్తా మీకొస్తుంది. ” థాంక్యూ… వుయ్ విల్ మీట్ అగైన్ నెక్స్ట్ క్లాస్…

*****

“నిరంజన్ ఊపిరి పీల్చుకున్నాడు… హమ్మయ్యా! అందరి ముందు మేమ్… నా పరువు తీస్తుందనుకున్నాను కానీ అలా ఏంచేయలేదు. ఆవిడ ‘మేమ్’ కాదు ‘మామ్’ అవును నేను ఇంట్లో కూడా చాలా సార్లు తప్పు చేశాను. ప్రతిసారి అమ్మ నన్ను నాన్న

నుంచి కాపాడుతూ ఉండేది. ఏం చేసినా వాడు చేసిన దానిలో అర్థముంటుంది. అనవసరంగా ఎందుకు వాడిని అయినదానికి, కానిదానికి తిడుతుంటారు. అని అమ్మ నా తరపున మాట్లాడుతుంటే ఎలా ఉంటుందో ఈ రోజు మేమ్ మాట్లాడుతున్నా అలానే అనిపించింది. నిజంగా ఈవిడ అమ్మే... అప్పుడు అనిపించింది నిరంజన్ కు తను తప్పు చేశానని... తప్పులు అందరూ చేస్తారు.... అందరూ సరిదిద్దుకుంటారు.... ఇక్కడ గొప్ప విషయమేమంటే నిరంజన్ కు ఆవిడ చాలా అందంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఆవిడ ఇప్పుడు అమ్మ కదా! అమ్మ అందంగా ఉండదని అనే వాళ్ళు ఈ లోకంలో ఎవరైనా ఉంటారా !?"

ఎంత అందంగా ఉందంటే

అన్ని రంగుల్ని తనలో దాచుకున్న రంగులా...

పున్నమి వెన్నెల అంత వెలుగులా ... స్వచ్ఛమైన పాలంత తెలుపులా...

కమ్మని రాగాలును ఆలపించే ఆమనికోయిలలా...

గుండెల్లో గుచ్చినా కూడా క్షమించే దేవతలా...

ఆవిడ ఎంత అందంగా ఉందో... నాకెందుకు అంత అందం లేదని, ఆవిడ అందాన్ని ముందుగానే నేనెందుకు గుర్తించ లేదని నిరంజన్ లోలోపల అనుకుంటూ మేమ్ వైపు అడుగులేస్తున్నాడు... క్షమించమని అడగడం కోసం...

తను వేసే అడుగులు మేమ్ వైపు మాత్రమే కాదు...

"నిశిధి నుంచి వెలుగు వైపు...

పతనం నుంచి ఉన్నతం వైపు...

అంధకారం నుంచి అర్కజుని వైపు...

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు...

చీకటి ఛాయల నుంచి కాంతి రేఖలవైపు...

కటిక హృదయం నుంచి కరుణ ఉదయం వైపు...

నలుపు నుంచి తెలుపు వైపు....

ప్రతి మనిషిలో నలుపు - తెలుపు రెండూ ఉంటాయి అవి చూసే మనిషి దృష్టిని బట్టి మారుతుంటాయి..."

నలుపు - తెలుపు రంగులు కాదు...




డియర్ రుతిక,

నేను నీతో ప్రేమలో పడ్డాననిపిస్తోంది. పదిహేను రోజుల క్రితం మనం తొలిసారి కలిసినప్పుడే ఈ అభిప్రాయం కలిగింది. తొలిచూపులో ప్రేమపైన నమ్మకం లేకపోయినా… ఇప్పుడు తప్పనిసరిగా నమ్మాలనిపిస్తోంది….నీ అన్వేష్…

ఈ-మెయిల్ పంపిన సరిగ్గా రెండు నిముషాల తర్వాత అతని ఇన్ బాక్సులోకి ఆమె పంపిన సమాధానం వచ్చి చేరింది.

మైడియర్ అన్వేష్…

సరిగ్గా నేను చెప్పాలనుకుంటున్న మాటల్నే నువ్వు చెప్పావు… అన్నట్టు రేపు వీకెండ్ కదా.. ఐమాక్ స్ లో కలుసుకుందామా?
… లవింగ్లీ రుతిక

అన్వేష్ ఆనందం పట్టలేకపోయాడు. వెంటనే సమాధానం పంపాడు.

“ తప్పకుండా… సరిగ్గా ఐదునిముషాల తక్కువ ఆరింటికి అక్కడ ఉంటా”…

“ నేను కూడా…” రుతిక.

అన్వేష్ సిగ్మా కంపెనీలో హెచ్.ఆర్. ఎగ్జిక్యూటివ్. ఓ రోజు కాబ్ లో వెళుతుండగా… అదే వాహనంలో వెళుతున్న రుతిక కనిపించింది. పలకరించాడు. ఇద్దరూ కాసేపు మాట్లాడి వీడ్కోలు చెప్పుకుంటున్న సమయంలో ఒకరి చిరునామాలు మరొకరు ఇచ్చుకున్నారు. ఇది జరిగిన నాలుగురోజుల తర్వాత చోటుచేసుకున్న పరిణామం ఇది.

ఆ మర్నాడు ఇద్దరూ పార్కులో కలుసుకున్నారు.కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక మొదటి ఆట సినిమా చూశారు.

“ నేను ఆ దారిలో వెళతా. మిమ్మల్ని హాస్టల్లో దింపేసి వెళ్లిపోతా” చెప్పాడు అన్వేష్.

“ అలాగే” … తలాడించింది ఆమె.

దారిలో ఓ ఖరీదయిన రెస్టారెంట్ దగ్గర ఆపాడు.

“ ఇక్కడ డిన్నర్ చేసి పోదాం. మీకేం అభ్యంతరం లేదుగా..” అడిగాడు.

“ ఇబ్బందిలేదు. అలాగే చేద్దాం” అంది.

అన్వేష్ ఆమెను సినిమా టిక్కెట్ తీసుకోనివ్వలేదు. రెస్టారెంట్ బిల్లు తనే ఇస్తానన్నాడు. అందుకు రుతిక ఎలాంటి అడ్డు చెప్పలేదు.“ మీతో గడిపిన నాలుగున్నర గంటల సమయం నాలుగు నిముషాల్లా గడిచిపోయింది.”

అన్వేష్ నుంచి ఆ రోజు అర్ధరాత్రి మెయిల్లో వచ్చిన సందేశాన్ని అందుకుంది రుచిత.

అది చదివాక ఆమె మనసంతా ఆహ్లాదభరితమయింది. ఏమని జవాబు పంపాలా అని కాసేపు మథనపడి చివరికి క్లుప్తంగా... 'సంతోషం' అని బదులిచ్చింది.

తర్వాత నెల రోజులపైగా వందల సందేశాలు వాళ్ల మెయిల్స్‌లో అటూ ఇటూ మారాయి. ఇద్దరూ తరచూ కలుసుకునేవారు. గంటలు గంటలు కబుర్లు చెప్పుకునేవారు. తమ బంధం మరింత ధృడమవుతోంది.. రేపో మాపో పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయచ్చు అని ఆమె అనుకుంటున్న తరుణంలో ...

ఆశ్చర్యకరంగా ఓ రోజు ఆమెకు అన్వేష్ నుంచి చిత్రమైన మెయిల్ వచ్చింది.

" ఆరునెలల వ్యవధిని మన ప్రేమ వ్యవహారానికి ప్రొబేషనరీగా పరిగణిద్దాం. ఆ తర్వాత మన మధ్య అవగాహన (కంపాటబులిటీ అని రాశాడు) మేరకు దాన్ని కొనసాగించవచ్చు. ఇద్దరిలో ఒకరికి అభ్యంతరం ఉన్నా దాన్ని అక్కడికక్కడే ముగించనూ వచ్చు. ఈ మధ్య కాలంలో ప్రేమికులుగా రాణించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు మనం పొందవలసి ఉంటుంది. ఆన్ ది జాబ్ ట్రెయినింగ్ అన్న మాట..."" పూర్తిగా ఉద్యోగ పరిభాషలో ఇదంతా చెప్పుకొచ్చాడు అనుకోకుండా ఉండలేకపోయింది. చదవటం కొనసాగించింది.

".... ఈ మధ్య కాలంలో హోటళ్లకు, సినిమాలకు ఇతరత్రా సరదాలకు వెచ్చించే మొత్తంలో చెరి సగం ఖర్చు భరించవలసి ఉంటుంది. ముందు.. ముందు .. నీ వ్యవహారశైలి బావుంటే.. సింహభాగం ఖర్చు నా జేబులో నుంచే పెడతాను. నీ కెట్టి అసౌకర్యం కలిగించనని ఈ సందర్భంగా తెలియచేసుకుంటున్నాను.."

ఇప్పటివరకూ అయిన ఖర్చులో నీ వాటా రూ.3, 250 స్వయంగా గానీ లేదా చెక్ రూపంలో గాని అందచేయగలవు. బిల్లు జత చేస్తున్నాను."

చదవటం ఆపి, డాక్యుమెంట్ ఎటాచ్ డ్ అన్న చోట క్లిక్ చేసింది. రిసార్టు బిల్లులు, హోటల్ బిల్లులు కనిపించాయి. ఏమిటీ చాదస్తం అనుకోకుండా ఉండలేకపోయింది.

“.. ఇదంతా నీకు సమ్మతమేనని భావిస్తాను. నీ అంగీకారాన్ని లేదా ఆమోదాన్ని వారం రోజుల లోపుగా తెలియచేయని పక్షంలో మన మధ్య ఒప్పందం ఆటోమేటిక్ గా రద్దవుతుందని తెలియచేయటమైనది. ఈ ప్రతిపాదన నీకు నచ్చని పక్షంలో ఈ మెయిల్ ని నీ ఎదురుసీట్లో ఉన్న వసుమతికి పంపగలవు.. ఆమె సరైన వ్యక్తి కోసం అన్వేషిస్తోందని ఈ మధ్యనే తెలిసింది.”

అప్పటి వరకూ సహనంగా ఉన్న రుతిక..

“ మొదటి చూపులో ప్రేమలో పడ్డానని చెప్పిన వాడు.. ఇప్పుడు ప్రొబేషనరీ పీరియడ్ లాంటి పిచ్చి ఆలోచనలు చేస్తున్నాడేమిటి?”కోపంగా అనుకుంది.

మొన్న రాత్రి రిసార్టులో జరిగిన విషయం ఆమెకు గుర్తుకొచ్చింది.

అక్కడేదో యూత్ ఫెస్టివల్ జరుగుతోందని వెళ్లారు.

విందులు, వినోదాలతో సరదాగా గడిచిపోయింది సమయమంతా. మనసును ఉర్రూతలూగించే సంగీతం, గేమ్స్ షోలు, ఆటపాటలు.. మధ్యమధ్యలో రకరకాల స్వీట్లు, కూల్ డ్రింకులు, సలాడ్లు సలాడ్సు, చివర్లో చవులూరించే భోజనం..

‘బలే మజా వచ్చింది కదూ..” అన్వేష్ అడిగాడు భోజనం పూర్తికాగానే.

“ అవును. చాలా రోజుల తర్వాత బాగా ఎంజాయ్ చేశాననిపిస్తోంది. ” రుచిత ఉత్సాహంగా చెప్పింది.

“ వాట్ నెక్స్ ట్”… అడిగాడు .

“ ఏముంది. సిటీకి తిరిగెళ్లటమే… కాబ్ ని పిలుద్దాం”

“ అప్పుడేనా?” నిరుత్సాహంగా అన్నాడు అన్వేష్. “ ఇక్కడ లేట్ నైట్ పార్టీ చాలా ఫేమస్ తెలుసా”..?

“ అర్ధరాత్రా..? అప్పటి వరకూ ఇక్కడ ఏం చేస్తాం?”

“ ఏముంది? రెండు మూడు గంటలు రిలాక్సవుదాం. ఇక్కడ రూంలు కూడా ఉన్నాయట...”

తన చెప్పదలుచుకున్నది పూర్తికాకుండానే గదిని సిద్ధం చేశాడు అన్వేష్.  మారుమాటకుండా అతనితో గదిలోకి నడిచింది.ఆ తర్వాత  మొదలయ్యింది అసలు వ్యవహారం. అన్వేష్ కావాలనే తనను అక్కడికి తీసికెళ్లాడని ఆమెకు అర్థమయింది.“ నేను పక్క గదిలోకి వెళ్లి రిలాక్సవుతా ” చెప్పింది  రుచిత.“ అదేం కుదరదు. ఇద్దరం ఈ గదిలోనే”... అంటూ ఆమెను బలంగా గుండెలకు హత్తుకున్నాడు. అతని ఉద్దేశం ఆమెకు అర్థమయింది.

“ ఇక్కడొద్దు ... ప్లీజ్.. వేరే డ్రెస్ కూడా తెచ్చుకోలేదు.”

అన్వేష్ అదోలా నవ్వాడు. “ సాధారణంగా పెళ్లికి ముందు ఇలాంటివి వద్దు అంటారు ఆడపిల్లలు. నువ్వేంటి విచిత్రంగా...”“ నా గురించి నువ్వెలా అనుకున్నా ఫరవాలేదు. ప్రస్తుతానికి వద్దు”.

“ అదేం కుదుర్దు.... ఇంత దూరం కష్టం పడి వచ్చింది...”

“ వద్దన్నాను గా...” రుచిత.

“ తప్పదు .. నీకు నచ్చినా నచ్చకపోయినా..” అంటూ.. ఆమె ఒంటిపైనున్న చున్నీని లాగి అవతల పారేసాడు.“ నా ఇష్టం లేకుండా పిచ్చి వేషాలు వేస్తే కుదరదు.. ”

అతని మొహంపైన పిడికిలి బిగించి ఒక్కటిచ్చింది రుచిత

అన్వేష్ ఇది ఊహించలేదు. అంత దూరాన వెళ్లి పడ్డాడు. అవమానభారంతో అతని మనసు కుతకుతలాడింది. కిందపడి ఉన్న అతన్ని ఆమెనే లేపి చెయ్యి అందించింది.

ఆ తర్వాత  నవ్వుతూ చెప్పింది. “నేను కరాటే నేర్చుకున్నాను. ఇలాంటి సమయాల్లో ఉపయోగపడుతుందని..”“ నువ్వంటే నాకిష్టం అన్వేష్.

“అదేదో దొంగతనం చేసినట్టు ... హడావిడిగా... చాటుమాటుగా  దేనికి?

.. మరెప్పుడయినా.. నువ్వు కోరినట్టే.. ఒకేనా?”

అతని చెక్కిళ్లపైన గాఢమైన ముద్దిచ్చింది.

ఆమె అంత తేలిగ్గా తనని క్షమిస్తుందని అతను ఊహించలేదు.

తన ప్రణాళిక విఫలమయినందుకు  మనసు విలవిలలాడినా...

పైకి మాత్రం నవ్వుతూ ఉండిపోయాడు.

ఆ రోజు రాత్రంతా  ఆమెతోనే  గడిపాడు.

ఆ తర్వాత వారం మామూలుగానే ఇద్దరం సినిమాకు, రెస్టారెంట్ కి వెళ్లారు.

“ అన్వేష్ తనను ప్రేమించటం లేదు. శారీరకంగా తనను కోరకుంటున్నాడంతే.. తను దక్కలేదన్న కోపంతో ఇప్పుడు వదిలించుకోవాలనుకుంటున్నాడు.”

రుచిత మనసంతా కల్లోలంగా మారింది.

“తనకు అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టాననుకుంటున్నాడు. ఆ విషయాన్ని సూటిగా చెప్పలేక ఇలా నాటకం ఆడుతున్నాడన్నమాట…అతన్ని వాడుకోవాలని తను ఏ నాడూ అనుకోలేదు.

కలిసి సరదాగా గడపాలి. బోలెడు కబుర్లు చెప్పుకోవాలని మాత్రం అనుకునేది.

అందుకే బయటకెళ్లినప్పుడు చాలా సార్లు తను డెబిట్ కార్డు తీసేది.

నీ ఖర్చంతా నాదే. నా సమక్షంలో నువ్వు డబ్బు ప్రస్తావన చేయద్దు అంటూ అతనే నిరాకరించేవాడు.”

ఆ రాత్రి చాలాసేపు ఆలోచనలతో సతమతమయింది.

ఓడిపోతున్న భావన ఆమెకు నిద్రపట్టనివ్వలేదు.

చివరికి ఆమె మెదడులో మెరుపు మెరిసింది. మంచం మీద నుంచ లేచివెళ్లి లాప్ టాప్ ఆన్ చేసింది.

మెసేజ్ కంపోజ్ చేయటం మొదలుపెట్టింది.

“ మిస్టర్ అన్వేష్…

నీవు పంపిన సందేశం నాకెంతో ఆహ్లాదాన్ని కలిగించింది.

నాకు పరిచయం ఉన్న సుశీల్, సుశాంత్, విక్రమ్ లలో ఎవరికీ లేని ప్రత్యేకత నీకుంది.

నీ ప్రతిపాదనలూ నాకు నచ్చాయి.

ఆ మాటకొస్తే.. ఇంత కాలిక్యులేటెడ్ గా ఇంకెవరకూ ఉండరేమో అనిపిస్తోంది. ఐ అడ్మైర్ యు.

పోతే నువ్వు పేర్కొంటున్న రెండు సందర్భాలూ నాకు రెండు వేర్వేరు అనుభవాలను మిగిల్చాయి.

ఓ నిముషం ఆగి మళ్ళీ కంపోజ్ చేయటం కొనసాగించింది.. “ మొన్న డిన్నర్ చేసొచ్చాక .. ఇంటికి రాగానే ఒకటే వాంతులు…అప్పటికప్పుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పరిగెత్తాను. కొంచెం ఆలస్యమయితే ప్రాణానికే ప్రమాదం అయి ఉండేదని చెప్పారు.ఫుడ్ కంటామినేషన్ అట.

అంత చిన్న విషయం ప్రాణాంతకమా? నాకు అర్ధం కాలేదు. మరుసటి రోజు పాతికవేల బిల్లు తీసి చేతిలో పెట్టారు.

నువ్వు చెప్పిన ప్రకారం.. అందులో సగం బిల్లు నా ఎక్కౌంట్లో నువ్వే వేయాలి.ఏమంటావ్…”రుచిత చేతివేళ్ళు .. ఆమె ఆలోచనలలాగానే కీప్యాడ్ పైన వేగంగా పరుగులు తీస్తున్నాయ్.

“… ఐమాక్సులో నన్ను నువ్వు సినిమా చూడనిస్తేనా?

ఆ రెండున్నర గంటలు నన్ను ముద్దులలతో ఊపిరిసలపకుండా చేశావ్… ఆనందంవల్లో, ఉద్వేగం వల్లో తెలియదు.. అంత ఏసి

గదిలోనూ నాకు చెమటలు పట్టేశాయి.

ఈ సారి తీరిగ్గా మళ్లీ అదే సినిమా చూడాలి.

ఇంటి దగ్గర కొచ్చిన నుంచి అవే ఆలోచనలు మళ్లీ మళ్లీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఎప్పుడెప్పుడు కలుద్దామా అని నా మనసు ఆరాటపడుతోంది.

అయితే.. ప్చ్.. మరో వారం రోజుల దాకా మనం కలిసే అవకాశం లేదు.

మా కొలీగ్ సుశాంత్ తో కలసి బెంగుళూరు వెళుతున్నా.

సుశాంత్ భలే చలాకీగా ఉంటాడు. నేనంటే చచ్చేంత ఇష్టం.

అప్పుడప్పుడు బహుమతులిచ్చి నన్ను సర్ప్రైజ్ చేస్తూంటాడు.

ఈ మెసేజ్ పంపుతున్న లాప్ టాప్ కూడా అతనిచ్చిందే.

నేను బెంగుళూరు నుంచి రాగానే కలుద్దాం. అప్పుడు అతను నాకిచ్చిన బహుమతులన్నీ చూపెడతా. అన్నట్టు నాది హెవీ షెడ్యూల్. నేను తిరిగొచ్చేవరకూ నో మెయిల్స్, నో మెసేజెస్, నో ఫోన్ కాల్స్ ప్లీజ్. ”

రుచిత పెదాలపైన చిరుమందహాసం

“ ఈ దెబ్బతో అన్వేష్ గాడికి చుక్కలు కనిపిస్తాయి. సుశాంత్ అనేవాడెవడా అని ఆలోచిస్తాడు. తనకీ, వాడికీ ఖచ్చితంగా సంబంధం ఉందని బలంగా నమ్ముతాడు. ఇక ఈ జన్మలో తన జోలికి రాడు” అనుకుంది. అన్వేష్ మొహంలో మెసేజ్ చదువుతుంటే కలిగే భావాలను ఊహించుకుంటున్న కొద్దీ ఆమెలో ఏదో తెలియని తృప్తి. కసితీర్చుకున్నానన్న భావన.

మరోసారి తృప్తిగా చదువుకుని మెసేజి పంపేసింది.

‘మెసేజ్ డెలివర్డ్ ’ అన్న అక్షరాలు కనిపించగానే సిస్టమ్ ని షట్ డౌన్ చేసేసి మంచం మీద వాలింది.

ఇంతకు ముందులా ఆలోచనలు ఆమెను ఇబ్బంది పెట్టలేదు. మనసు ప్రశాంతస్థితికి చేరింది.

“ఇప్పుడు తను కొత్తగా సుశాంత్ ని వెతుక్కోవాలి.

అసలు అలాంటి వ్యక్తి ఉన్నాడో లేడో..

ఆలోచనలలోనే నిద్రలోకి జారుకుంది రుచిత.



శ్రీపురంలో ఉండే సుదీపుడుకి ఆదర్శభావాలు ఉన్నాయి. తమవూరికి పనికొచ్చే పనులు చేస్తుండేవాడు. అతడంటే గ్రామస్తులకు అభిమానం ఉండేది. ఇంకా ఏవైనా గొప్ప పనులు చేసి తమ ఊరుకి పేరు తేవాలన్న అతడి ఉద్దేశం మిత్రులతో చెప్పేవాడు. వారికి మరింత గౌరవం పెరిగింది. తమ వూరిలోని స్త్రీలు చెరువు నుండి నీరు మోసే దారి బాగులేకపోవడం చూసాడు సుదీపుడు. ముళ్ళ మొక్కలతో నిండిన దారిలో నడవడం కష్టంగా ఉందని పోల్చుకుని స్నేహితులతో కలిసి దారిని శుభ్రం చేయించాడు.వాళ్ళు ఆ పనిలో ఉన్నప్పుడు అక్కడకి నందనుడు అనే మిత్రుడు వచ్చాడు.

అతడు సుదీపుడితో "మన ప్రక్క వూరులో ఈ సాయంత్రం బరువులు ఎత్తే పోటీ ఉంది. నువ్వు బలంగా ఉంటావు. బరువు ఎత్తగలవు. అక్కడకి వెళ్ళావంటే బహుమతి వస్తుంది" అన్నాడు.

చుట్టూ ఉన్న మిత్రులు సుదీపుడిని ప్రోత్సహించారు. "నువ్వు వెళ్ళావంటే తప్పకుండ గెలుస్తావు. మన వూరికి గుర్తింపు తేవాలన్న నీ కోరిక తీరుతుంది" అన్నారు.

వాళ్ళ మాటలతో సుదీపుడిలో నమ్మకం పెరిగింది. తమ వూరికి పేరు వస్తుందంటే మంచిదే కదా అనుకుని "తప్పకుండా వెళదాము. నాకూ నా బలమేమిటో తెలుస్తుంది. మీరు వస్తే నాకు ధైర్యంగా ఉంటుంది" అని చెప్పాడు.

అందరూ కలిసి సాయంత్రం పొరుగూరు వెళ్ళారు. వూరి మధ్య ఉన్న రచ్చబండ దగ్గర పోటీలు జరుగుతున్నాయి. పోటీలో పాల్గొడానికి చాలా ఊర్ల నుండి యాభై మంది వరకూ యువకులు వచ్చారు. రచ్చబండ మీద న్యాయనిర్ణేతలు, బహుమతి ప్రదాతలు కూర్చున్నారు.

రచ్చబండ ఎదురుగా ఉన్న స్థలంలో ఇసుక పోసిన ప్రదేశంలో నునుపుగా, గుండ్రంగా చెక్కిన బండరాళ్ళు చిన్నవి మొదలు పెద్దవి వరకూ పదికి పైగా ఉన్నాయి. రాయికి మధ్య భాగంలో చేతులతో ఎత్తి పట్టుకునే విధంగా పిడి చెక్కి ఉంది. పాతిక కిలోల బరువు మొదలు వంద కిలోల వరకూ ఉన్నాయి.

పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీ నియమ నిబంధనలు మరొకసారి చెప్పాడు గ్రామపెద్ద. "ముగ్గురుకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తాం. రాయిని పైకెత్తి కనీసం రెండు నిముషాలు గాలిలో ఉంచాలి" అని చెప్పాడు.

అక్కడకి వచ్చిన యువకుల్లో సుదీపుడి కంటే బలమైనవాళ్ళు ఉన్నారు. బలహీనులూ వచ్చారు. కొందరు యాభై కిలోల రాయి పైకి ఎత్తగలిగారు. మరికొందరు ఎనభై కిలోల రాయి వరకూ పైకి లేపగలిగారు. వాళ్ళ బలానికి సుదీపుసు ఆశ్చర్యపోయాడు.

సుదీపుడి వంతు వచ్చినప్పుడు తన కంటే బలహీనులు ఎత్తిన బరువులు గుర్తు తెచ్చుకున్నాడు. వాళ్ళు యాభై నుండి అరవై కిలోల బరువుని సునాయాసంగా పైకి లేపినప్పుడు తాను ప్రయత్నిస్తే యాభై కిలోల బరువున్న రాయి ఎత్తగలనని అనుకున్నాడు. మనసులో దేవుడిని తలచుకుని యాభై కిలోల బండరాయిని ప్రయత్నించాడు. దానిని కొంచెం కూడా కదపలేక పోయాడు. పైగా రాయిని ఎత్తే ప్రయత్నంలో ముందుకి తూలి పడ్డాడు. అతని తల బండకి తగిలి దెబ్బ తగిలింది.

అక్కడున్న వాళ్ళు అది చూసి హేళనగా నవ్వి "చూడ్డానికి బలంగా ఉన్నాడు. కదపలేక బోర్లా పడ్డాడు. లోపల అంతా డొల్లే' అని ఎగతాళి చేసారు.

సుదీపుడికి అవమానం అనిపించి ఒక్కక్షణం ఆగకుండా వూరికి వెళ్ళిపోయాడు. దారిలో తమ వూరి వైద్యుడు రామాచారిని కలిసి వైద్యం చెయ్యమన్నాడు.

రామాచారి వయసులో పెద్దవాడే కాకుండా అనుభవజ్ఞుడు. గ్రామస్తులకి మంచి మందులిచ్చి వైద్యం చేసేవాడు. సుదీపుడిపై సదభిప్రాయం ఉందతనికి. గాయం విషయం సుదీపుడిని అడిగాడు రామాచారి.

తాను పొరుగూరిలో జరిగిన పోటీలో పాల్గొన్న విషయం చెప్పి "నా కంటే బలహీనులు సునాయాసంగా ఎత్తిన బరువుని కూడా ఎత్తలేక పోయాను.ఆ ప్రయత్నంలో దెబ్బ తగిలింది. ఇలా జరగడం తొలిసారి కాదు. క్రితంలో ఒకసారి పొరుగూర్లో జరిగిన ఈత పోటీల్లో కూడా ఓడిపోయాను. నాకు నిజమైన శక్తి లేదేమో అని అనుమానం. ఇలా అయితే మన వూరికి పేరు, గుర్తింపు తీసుకురావాలన్న నా ఆశయం నెరవేరదు" అని చెప్పాడు సుదీపుడు.

ముందుగా సుదీపుడి గాయానికి మందు రాసిన రామాచారి తరువాత ఇలా చెప్పాడు. "అక్కడి పోటీల విషయం తెలిసి అప్పటికప్పుడే పాల్గొన్నావు నువ్వు. మిగతావాళ్ళు అలా కాకుండా ముందు నుండి పోటీ కోసం తయారయ్యారు. వాళ్ళు రోజూ బరువులెత్తడం సాధన చేసి ఉంటారు. అందుకే నీకంటే బలహీనులు కూడా ఎక్కువ బరువు ఎత్తగలిగారు. ప్రతిరోజూ సాధన చేస్తే ఏ పని అయినా సులభంగా చెయ్యగలుగుతారు. అలవాటు లేని పని ఒక్కసారి చేస్తే ఇలాగే జరుగుతుంది. ఈత పోటీల్లో కూడా ఇలాగే ఓడిపోయి ఉంటావు. ఎడారిలో మంచినీళ్ళ నాశించడం ఎంత పొరపాటో సాధన లేకుండా విజయాన్నాశించడం కూడా

అంతే. ఇకముందు పోటీల్లో పాల్గొనే ముందు తగిన సాధన చేసి వెళ్ళు. విజయం లభిస్తుంది'.

సుదీపుడికి తన తప్పు తెలిసి వచ్చింది. తరువాత జరిగే పోటీలలో పాల్గొనే ముందు తగిన సాధన చేసి వెళ్లి విజయాలు పొంది పూరు పేరు నిలబెట్టాడు.




"మాటలతో కాపురం"

అవును. మీరు సరిగ్గానే చదివారు.

మరీ చోద్యం కాకపోతే ..."కాపురం పెళ్ళాంతో చేస్తారు కానీ మాటలతోనా!" అని ఆశ్చర్యపోకండి.

అది నిజంగా నిజం. అవును మరి!

నాకు కొత్తగా పెళ్ళై కొత్త కాపురం పెట్టానా !... అవును అది మీకెలా తెలుస్తది?

నేను చెబితేగా! అయితే వినండి.

నాకు కొత్తగా ఈ మధ్యనే పెళ్ళయింది. కొత్త పెళ్ళాం కాపురానికి కూడా వచ్చేసింది.

"చిన్న పిల్ల ...గారాబంగా పెంచాం అల్లుడూ! జాగ్రత్తగా చూసుకోండి!" పిల్ల చేతిని నా చేతుల్లో పెడుతూ వలవల ఏడ్చేసింది మా అత్తగారు."మీరేం కంగారు పడకండి అత్తగారూ! కంటికి రెప్పలా కాపాడుకొంటాను " అని భరోసా కూడా ఇచ్చేశాను మెరిసిపోతున్న కొత్త పెళ్ళాం కళ్ళలో మెరుపు చూస్తూ;

"అది కాదు అల్లుడూ! చిన్న పిల్ల కదా వంట చేయడం కూడా సరిగ్గా రాదు ... కొంచెం సర్దుకుపోండి"

"అలాగే అత్తమ్మా! మీరింతగా చెప్పాలా? తనకెలాంటి కష్టం రానివ్వను. మీకెలాంటి ఇబ్బంది పెట్టను. నన్ను నమ్మండి. " అని ఓదార్చాను." అసలే నోట్లో నాలుక లేని పిల్ల ... ఎలా బతుకుతుందో" ఏడుపాపుకుంటూ అంది అత్తగారు."ఇంకోసారి చెప్పమ్మా! నోట్లో నాలుక లేదా? అయ్యో! ...పాపం బావ!" బామర్ది వేళాకోళం.

"రేయ్!" చెయ్యి పైకెత్తింది సిగ్గుల మొగ్గ.

వాడు తప్పించుకుని పారిపోయాడు.

ఆమె నాకు మేనత్త. చిన్నప్పట్నుంచి చనువెక్కువే. ఈ పెళ్ళాం అనే పిల్ల పుట్టినప్పుడే నాదేనని రాసిపెట్టేశారు అక్కడ

బ్రహ్మీ కాదు ఇక్కడ అత్త,మామ,అమ్మా నాన్నలు కూడా. ఆ చనువుతోనే ఆమె అన్ని జాగ్రత్తలు చెప్తూంది . అందులోనూ మా కాపురం హైదరాబాదులో అదీ ఆమె బాధ. మరి హైదరాబాద్ లో నేను ఉద్యోగం వెలగపెట్టుంటా లెండి.

అనుకున్నట్టు - అదిగో హైదరాబాద్ లో కాపురం కూడా పెట్టేశాం. నాలుగు రోజులుండి కొత్త కాపురాన్ని కనిపెట్టడానికి; కావాల్సినవి కొనిపెట్టడానికి మా అమ్మా; నాన్నలు కూడా మాతోబాటు వచ్చారు.

వచ్చిన రోజే " అమ్మాయీ! కొద్ది స్ట్రాంగ్ గా కాఫీ పెట్టమ్మా? తలనొప్పిగా ఉంది" అన్నారు మా నాన్నగారు.

ఇంకేముంది? మా ఆవిడ నడుం బిగించి కాఫీ పెట్టి తలా ఒక గ్లాస్ ఇచ్చింది.

ఒక సిప్ చేసి చేదు భరించలేక బయట ఉమ్మేశాను.

"ఏంట్రా?" మా నాన్న అడిగాడు.

షుగర్ లేదు నాన్నా?"

ఆయన గట్టిగా ఒక నవ్వు నవ్వి అన్నాడు - " నాకు షుగరని చక్కెర వేయలేదు కోడలు పిల్ల! పర్వా లేదు. అందరూ అలాగే తాగండి. ఎందుకంటే మన కుటుంబమే షుగర్ ప్రోన్ అట. అందరూ షుగర్ తగ్గించమని డాక్టర్ ఎప్పట్నుంచో మొత్తుకుంటున్నాడు. "

"మామయ్యకి షుగరనీ" నసిగింది.

"చూడు! అమ్మాయికి అప్పుడే హెల్త్ కాన్షియస్ వచ్చేసింది. ముందుచూపుగా ఇప్పటి నుంచే జాగ్రత్తలు పాటిస్తోంది వచ్చీ రాగానే! నువ్వూ... వున్నావు ముప్పై ఏళ్ళుగా ఎప్పుడైనా ఇలాంటి కాఫీ పెట్టావా? నా ఆరోగ్యాన్ని పట్టించుకున్నావా?" అమ్మకు క్లాస్ పీకాడు నాన్న.

పనిలో పనిగా కొత్త కోడల్ని తెగ మెచ్చేసుకున్నాడు. అలా మా నాన్న దగ్గర మంచి కోడలనిపించేసుకుంది.

నాకనుమానం వచ్చి "అవును బంగారం! మీ మామగారికి షుగరని నీకెలా తెలుసు?" అనడిగా. ఎందుకంటే అది మాకే గుర్తు లేదు. ఆయనా పట్టించుకోకుండా ఏ జాగ్రత్తలు తీసుకునే వాడు కాదు. అంతా లైట్ గా తీసుకునే రకం.

జవాబుగా ఒక నవ్వు విసిరి; ఆ వాల్జడను వయ్యారంగా తిప్పుతూ వంటింట్లోకి దూరింది.

ఆ రాత్రి కూరల్లో ఉప్పే లేకుండా చేసింది.

ముద్ద కలిపి నోట్లో పెట్టుకుని ఊంచేశాను- "ఉప్పే లేదంటూ"

"అత్తయ్యగారికి హై బీ పీ. అందుకే తగ్గించాను." మెల్లగా గొణిగింది.

ఇక అమ్మ మురిసిపోయింది. "మా యమ్మే. నా ఆరోగ్యం గూర్చి ఎవరు పట్టించుకోలేదు ఇంతవరకు." కోడలి తలపైన చెయ్యేసి ప్రేమతో నిమిరింది.

అత్తగారి దగ్గర కూడా అలా మంచి మార్కులు కొట్టేసింది కొత్త కోడలు.

"బీ పీ కంట్రోల్ లో ఉంచుకోవాలి అత్తయ్యగారు! ఉప్పు తగ్గించేసి రోజూ అలా వాకింగ్ చేస్తే చాలు. ఏమీ ఇబ్బంది ఉండదు." సలహా కూడా ఇచ్చేసింది.

"మీరు కూడా మామయ్యగారూ! మందులు రెగ్యులర్ వేసుకుంటూ కొంచెం ఆహార నియమాలు పాటిస్తే ఏం ఇబ్బంది ఉండదు. ఇక మీదట మీరిద్దరూ ఆరోగ్యం పైన శ్రద్ధ వహించాలి. లేకుంటే నేనూరుకోను" మెత్త మెత్తగానే హెచ్చరించింది.

అంతే కాదు. మర్నాడు ఇద్దర్నీ బలవంతంగా దగ్గర్లోని హాస్పిటల్ కు తీసికెళ్ళి చెక్ చేయించి మాత్రలు తీసుకొచ్చి ఎలా వాడాలో చెప్పి;ఆ పూటకి దగ్గరుండి మరీ వేయించింది. ఏమేమి తినాలో; ఏవేవి తినకూడదో దారి పొడుగునా ఏకరువు పెట్టింది. తమ ఆరోగ్యం పట్ల కోడలు చూపిస్తున్న ఆదరణకు ఇద్దరూ తెగ మురిసిపోయారు.

మూడో రోజు చుట్టు ప్రక్కల అమ్మలక్కలంతా మా ఇంట్లో సమావేశమైపోయారు. మా ఆవిడ కలుపుగోలుతనం అలాంటిది మరి! క్షణం తీరిక లేకుండా వసపిట్టలాగా వాగడం కూడా తెగ నచ్చేసింది వారికి. ఇక ఆమె సమక్షంలో నాకు; నా ఆరోగ్యానికి ఎలాంటి ఢోఖా లేదని గట్టి నిర్ణయానికి వచ్చేశారు అమ్మానాన్న.

మా అమ్మయితే "అబ్బాయి అమాయకుడు. జాగ్రత్తగా చూసుకోమ్మా! మనవాళ్ళు ఇక్కడెవరూ లేరు. మీరే ఒకరికొకరు తోడు.. జాగ్రత్తగా కాపురం చేసుకోండి" నా చేతులు ఆమె చేతుల్లో పెట్టింది. ఇద్దర్నీ చుట్టుపక్కల వారికి అప్పచెప్పింది.

కొంటెగా కళ్ళు గీటి భుజాలెగరేసింది మా ఆవిడ. బుగ్గలు ఎరుపెక్కాయి.కొత్త కాపురానికి కావాల్సినవి కొనిచ్చి; కోడలికి కాపురం మెలకువలు బోధించి నాలుగో రోజే సంతృప్తిగా రైలెక్కేశారు అమ్మా;నాన్నలు. ఇక నా పాట్లు మొదలయ్యాయి.

నాకు రుచి రుచిగా; రక రకాలుగా వంటలు చేసి పెట్టాలని నానా తంటాలు పడేది నా సతీమణి. వంటల పుస్తకాలు; టీ వీ షోలు; అక్కింటి పక్కింటి వాళ్ళ సహాయం తీసుకుంటూ ఆపసోపాలు పడేది.

గ్యాస్ పై పాత్రలు పెట్టేసి, ఫోన్ లో వాళ్ళమ్మ డైరెక్షన్ లో కూరలు చేసే విధం చూసి తరించాల్సిందే.ముఖమంతా చెమటతో "అబ్బ! ఈ రోజు వంట అయిపోయింది" అని గొప్ప రిలీఫ్ తో వంటింట్లోంచి బయటికి వస్తున్న ఆమె అవతారం చూస్తే జాలేస్తుంది.వడ్డించిన తర్వాత చూడాలి ఆమె టెన్షన్ – ఐ ఏ యస్ రాసి రిజల్ట్స్ కోసం ఎదురు చూస్తున్నట్టు. ఆ వంటల్లో ఏదో ఒకటి తక్కువ అవడమో; ఎక్కువ అవడమో జరిగేది.

ఉప్పు తక్కువనో; పులుపు ఎక్కువనో; కారం ఇంకాస్త వేయాలనో చెప్పాననుకోండి. ఐ ఏ యస్ పరీక్ష తప్పినంత బాధ పడిపోయేది. బాగా నిరుత్సాహపడేది. నేను ఎంత కష్టపడి చేశాను అని మూతి ముడుచుకొనేది. నేను తినక పోతే తను తినేది కాదు. ఈ "అతి" ప్రేమను తట్టుకునేది చాలా కష్టమనిపించేది.

"ఈ రోజు కూరలు చాలా బాగా చేశావు." అంటే ఆ రోజంతా నేలపైన నడిచేదే కాదు. కాకపోతే నా దురదృష్టం ఏమంటే - బాగుందని పొగిడితే ఇక జన్మలో మళ్ళీ ఆ టేస్ట్ రాదు. "అలా చేయరాదే" అంటే "అలాగే చేశానండి" అంటుంది.

"మరి ఆ టేస్ట్ రాలేదేమిటి?" అంటాను.

"ఏమోనండి. మొన్న చేసినట్లే చేశానే..." అంటుంది అమాయకంగా.

ఆమె చేసే ఏ వంటా ఒక రకంగా ఉండదు. రోజుకో రుచి. వాసన. స్వభావం. మాటలు మాత్రం ఏ రోజుకు తగినట్లు ఆ రోజుకు మార్చేసి నవ్వేస్తుంది.అందుకే ఏది తక్కువయినా; ఏది ఎక్కువైనా మందులా మింగడం అలవాటు చేసుకుంటున్నాను.

కాకపోతే వాటికి ఆమె చెప్పే కారణాలు వింత వింతగా ఉంటాయి.

ఉప్పు తక్కువయిన రోజు - " ఉప్పు ఎక్కువైతే బి పి వస్తుందండి" అంటుంది.

కారం తక్కువయిన రోజు - " కారం ఎక్కువయితే అల్సర్ వస్తుందండి." అంటుంది.

కాఫీ లో షుగర్ తక్కువయిన రోజు - "షుగర్ కు మంచిదండి" అంటుంది.

ఎక్కువయిన రోజు - "ఎప్పుడూ చప్పిడి కూడేనా? " అంటుంది.

మాటలు నేర్చిన వారికి ఏం చెప్పగలం?

ఒకరోజు ఉడికీ ఉడకని వంకాయ కూర తెచ్చి పెట్టింది.

"ఇదేమిటే" అన్నాను.

"ఈ రోజు మంతెన సత్యనారాయణ టీవీలో చెప్పారండీ ! పచ్చి కూరగాయలు ఆరోగ్యానికి మంచిదట!"

"పచ్చివే పెట్టలేకపోయావా?" ఆగ్రహం ఆపుకోలేక అరిచాను.

"మీరు మరీను! ఆయనే ఒక కిటుకు చెప్పాడు. మనకి పచ్చివి తినడం అలవాటు తప్పింది కాబట్టి హాఫ్ బాయిల్డ్ చేసుకోమని. అందుకే సగమే ఉడకబెట్టా. పూర్తిగా ఉడకబెడితే పోషకాలు పోతాయట. ఇలా అయితే ఆరోగ్యానికి ఆరోగ్యం. గ్యాస్ ఆదాకు ఆదా." ముసిముసిగా నవ్వింది.

"అసలే గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి" ముక్తాయింపుగా నవ్వు.

"ఓ! అలా కూడా ఉందా?" అని నోరెల్లబెట్టడం నా వంతయింది - ఆవిడ పొదుపు మంత్రానికి నవ్వాలో ఏడ్వాలో తెలియక.

మర్నాడు - పూర్తిగా ఉడికిపోయిన వంటకం పెట్టింది.

అదిరిపడి "మళ్ళీ! ఇదేమిటే!" అన్నాను.

"పక్కింటి బామ్మగారు చెప్పారండి. పచ్చి కూరలు మగవారికి మంచిది కాదట. ఆయువు క్షీణిస్తుందట. బాగా ఉడకబెట్టి తింటే బాగా జీర్ణమై ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందట." తన తెలివికి తనే మురిసిపోయింది.

"తెల్లారినట్లే ఉంది తెలివి." విసుక్కున్నాను.

"అదేంటండీ! మీరు నూరేళ్ళు నిండుగా ఉండాలని నా తాపత్రయమంతా!" బొంగురు గొంతుతో మూతి బిగించింది. విసుక్కున్నా; కోపగించినా; సరిగ్గా తినక పోయినా నెత్తి మీదే ఉంటుంది నీళ్ళు. కన్నీళ్ళతో మంచం ఎక్కేస్తుంది.

అసలే కొత్త ప్లేస్, కొత్త కాపురం ఏదైనా అఘాయిత్యానికి పాల్పడుతుందేమోనని అనుమానం. భయం కూడా! పైగా అత్తగారికి జాగ్రత్తగా చూసుకుంటానని మాటిచ్చాను. అందులోనూ మాట తప్పని వంశం మాది.

నా భయం నిజమయింది. అనుకున్నదంతా అయింది. ఒక రోజు ఉదయమే మా చిన్న బామర్ది వూడిపడ్డాడు.

"ఏంట్రా? చెప్పా పెట్టకుండా ఊడిపడ్డావు?" అన్నాను.

"ఏం? చెప్పుంటే జాగ్రత్తలు తీసుకునే వాడివా?" అన్నాడు.

నేనవ్వాక్కయ్యాను.

ఇంతలో ఊడిపడింది మహా తల్లి " ఏంట్రా! ఎప్పుడొచ్చావు" అంటూ.

"ఇప్పుడు చెప్పక్కా? ఏమయింది."

"ఏమయిందీ.."

"భయపడకక్కా? నేనున్నాను. ఇలాంటి వార్ని గృహహింస కింద బుక్ చేసి బొక్కలో తోసేయాలి."

"ఏమంటున్నావు రా? గృహహింస ఏంటి? బొక్కలో తోసేయడమేమిటీ? "

"నిజం చెప్పక్కా? నిన్న మధ్యాహ్నం నువ్వెందుకేడ్చావ్?" సూటిగా అడిగాడు.

"ఎప్పుడు రా?"

"నిన్న మూడు గంటలకు ... నాన్న నీకు ఫోన్ చేసినప్పుడు నువ్వెందుకు ఏడుస్తున్నావు? బావ నిన్నేమన్నాడు?"

"అప్పుడా..?" గట్టిగా నవ్వింది. నాకంతా అయోమయంగా ఉంది.

"నిన్న టీ వి సీరియల్ చూస్తున్నానా? అందులో హీరోయిన్ కష్టాలు చూడలేక ఏడుపు వచ్చింది. అప్పుడే నాన్న ఫోన్ చేశాడు. ఏడుపు కంట్రోల్ కాలేదు. అలాగే మాట్లాడి ఉన్నట్లుంది." చాలా తేలిక గా చెప్పింది. "అంతేనా? ఏదైనా దాస్తున్నావా? చెప్పు!""అంతేరా! పాపం... మీ బావ చాలా మంచోడు రా!"

"మేమంతా ఎంత కంగారుపడ్డామో తెలుసా?" అని మెత్త పడ్డాడు.

అబ్బా! బతికించింది. వాతావరణం తేలిక పడింది.

"లేచి స్నానం చేసి టిఫిన్ తినరా!" అని ఆ ఏర్పాట్లల్లో మునిగింది. నన్ను కొరకొరా చూస్తూ బాత్ రూం కెళ్ళాడు వాడు. వాడి ఏనుగు గున్న రూపం వాడూనూ! అంతే కాదు. నాకు తెలియకుండా చుట్టుపక్కల వాళ్ళను విచారించి రెండో రోజు రైలెక్కాడు.వాడెళ్ళేంత వరకు నా గుండెల్లో రైళ్ళు పరుగెడుతూనే ఉన్నాయి.వెళ్తూ వెళ్తూ " సారీ! ఏమనుకోకు బావా! మా అక్క చిన్నపట్నుంచి అంతే! నవల చదివినా...టీ వి సీరియల్ చూసినా పాత్రలో లీనమైపోద్ది . ... మా అక్క ఫీల్ అవుద్దని...హీ...హీ...హీ బిల్డప్ ఇచ్చా" అన్నాడు.

"వీడి దుంప తెగా!" ఏడవ లేక నేనూ నవ్వాను.

ఒక రోజు - "పండక్కి మైసూర్ పాక్ చేయనాండీ" గారాలు పోయింది మా ఆవిడ. "చేయడం వచ్చా?" అడిగాను. "వచ్చండి" తల ఊపింది.

"అయితే చెయ్" ఆమె ఉత్సాహాన్ని కాదనలేక సరే అన్నాను. అయితే నేనెంత తప్పు చేశానో సాయంత్రానికి తెలిసింది. ఆఫీస్ నుంచి వచ్చి రాగానే "వచ్చారా?" అంటూ మైసూర్ పాక్ పళ్ళెంలో రెడీ.

నాకు చాలా ఆనందం వేసింది. కొత్త పెళ్ళాం. కొత్త కాపురం. స్వహస్తాలతో స్వీట్ చేసి ప్రేమగా తీసుకొచ్చిందంటే నేనంటే ఎంత ప్రేమ. చప్పున ము...పెట్టబోయాను కానీ తప్పించుకొని "ముందు స్వీట్ టేస్ట్ చేసి ఎలా ఉందో చెప్పండి" అంది. ఇక తప్పేదేముంది? ఒక ముక్క తీసి నోట్లో పెట్టుకున్నానంతే! పళ్ళకు గట్టిగా తగిలింది.

"చూడు బంగారం! ఇదేదో చాలా గట్టిగా ఉంది" అన్నా. అంతే!

ఆమెకు ఏడుపు తన్నుకొచ్చేసింది. "అంతేలెండి! ఎంత కష్టపడి చేశాను. ఎంత ప్రేమతో చేశాను.' అంటూ ముక్కు చీదుకుంటూ అలక పానుపు ఎక్కేసింది.

"నా పైన ప్రేముంటే తింటారు. లేకుంటే నా మీద ప్రేమ లేనట్లే" డిక్లేర్ చేసేసింది.

నేనిప్పుడు ఆ రాళ్ళను తిని నా ప్రేమను నిరూపించుకోవాలి. తప్పదు. ఏం చేద్దాం?

"తప్పదా?" చివరిసారిగా అడిగాను మనసు మార్చుకోమని."తప్పదు" అంది. దేవుడి పైన భారం వేసి ఒక ముక్క నోట్లో వేసుకుని గట్టిగా కొరికాను. ఇంకా గట్టిగా కొరికాను. బలాన్నంతా ఉపయోగించి కొరికాను. మైసూర్ పాక్ కు ఏమీ కాలేదు. రెండు పళ్ళు ఊడి చేతికొచ్చాయి. రక్తం బొట బొటా కారి కింద పడింది.

"ఏమయిందండి! రక్తం వస్తోందేంటీ" కంగారుగా పరుగెత్తికొచ్చింది.

"చెప్పాను కదవే! అవి గట్టిగా ఉన్నాయని." దవడని అదుముకుంటూ చెప్పాను.

అప్పుడు ఆమె కూడా ఒక ముక్క నోట్లో వేసుకుని "అవునండీ! ఇలా ఎందుకయ్యిందీ" ఆశ్చర్యపోయింది.

"అయ్యో! పాపిష్టి దాన్ని ! డాక్టర్ దగ్గరికి పోదాం పదండి" హడావుడి చేసింది.

ఫలితంగా - పది వేలు ఖర్చయింది. వారం రోజుల సెలవు పోయింది. . చుట్టుపక్కల వారికి బాత్రూం లో జారి పడ్డట్టు అబద్ధం చెప్పాల్సి వచ్చింది. పదివేలు పోతే పోయింది కాని ఆ వారం రోజులు నన్ను చాలా జాగ్రత్తగా; ప్రేమగా చూసుకుంది. నేను మరీ సన్నగా ఉంటానని... ఈసారి వచ్చేసరికి అబ్బాయి గుండ్రంగా ఉండాలని బామ్మ నూరి పోసి పంపిందట. రక రకాల వంటలు చేసి తినిపించి; తినక పోతే ఏడ్చైనా...అలిగైనా... తినేట్లు చేయాలని సలహా ఇచ్చిందట. వంటల్లో తన ప్రావీణ్యాన్ని అంతా రంగరించి ప్రయోగాలు మొదలెట్టింది. వంట పుస్తకాలు, టీ వీ లలో వంట ప్రోగ్రాములు చూసి చూసి రక రకాల వంటలు చేసి చేసి అలసిపోయింది. నేను గుండ్రం మాట అటుంచి మరింత సన్న బడ్డాను. నీరసించిపోయాను. "ఏంట్రోయ్! కొత్త పెళ్ళికొడుకా! పెళ్ళయితే ఎవరైనా లావెక్కుతారంటారు! నువ్వేం? చిక్కిపోతున్నావు? " అంటూ వేళాకోళం మొదలెట్టారు మిత్రులు.

ఓ మంచి మూడ్ చూసి "బంగారం! నాకో ఉపకారం చేసిపెడ్తావా?" అన్నాను.

"అదేంటండీ! మీ మాటే నాకు వేద వాక్కు. మీ మాట ఎప్పుడైనా కాదన్నానా?" అంది.

"అయితే! ఇలాంటి ప్రయోగాలు ఇక చేయబాకు" అన్నాను నసుగుతూ.

"మొగుడికి ఈ విధంగా వండిపెట్టి మనసు చూరగొనాలని మా బామ్మ చెప్పిందే!"

"మీ బామ్మ అలా చెప్పిందా? అందుకే పాపం ఆమె మొగుడు అంత త్వరగా టపా కట్టేశాడు."

"అయ్యయ్యో! అవునా?..."

"ఇప్పుడు చెప్పు! ప్రయోగాలు...."

"లేదు... లేదండి! ఇక చేయను."

"ఒట్టు."

"ఒట్టు." నెత్తిన చేయి పెట్టుకుంది.

గుడ్." అన్నాను దగ్గరికి తీసుకుంటూ.

అప్పట్నుంచి ప్రయోగాలికి ఫుల్ స్టాప్ పడిపోయింది.

ఒకసారి వూరెళ్ళినపుడు - "మా అమ్మాయి వంటలు ఎలా ఉన్నాయి అల్లుడూ!" అని పరామర్శించారు మామగారు.

ఆమె పాకశాక నైపుణ్యాన్ని వివరించి "ఆమె చెప్పేంత వరకు అది ఏ కూరో నా కర్థం కాదు" అని వాపోయాను. అదేదో ఘనకార్యం అయినట్టు గట్టిగా నవ్వాడాయన.

"ఇంతకీ అమ్మాయీ! ఎన్ని గంటలకు లేస్తావు" అనడిగాడు కూతుర్ని.

ఏడు గంటలకే లేసేస్తాను డాడీ" అంది ఆవిడ గొప్పగా.

"అంత అర్లీ మార్నింగ్ లేచి ఏం చేస్తావు?" అన్నాడాయన వ్యంగ్యంగా- నవ్వుతూ.

"ఏమేవ్! నీ కూతురు ... అర్లీ ఇన్ ద మార్నింగ్ ఏడు కే లేచి..."

"చాల్లేండి వెటకారం! చిన్న పిల్ల ఆ మాత్రం చేసుకుపోతుంది ...సంతోషపడకుండా.." అని అత్తగారి ముసి ముసి నవ్వులు.

"పాపం! బావను చూస్తే జాలేస్తుంది" బామర్ధి జాలి చూపులు.

తమ ఏకైక కూతురి నిర్వాకం వాళ్ళకొక ముచ్చట గా ఉంది.

"ఏం చేద్దాం!" ఇక నా బాధలు ఎవరికి చెప్పుకోను?

ఉద్యోగపరంగా జిల్లాలు; రాష్ట్రాలు దాటి పనిచేశాను. తనకు మాత్రం ప్రాంతాలతో గానీ; భాషలతో గానీ ప్రమేయం లేదు. ఏ రాష్ట్రమైనా; ప్రాంతమైనా; కులమైనా చుట్టుపక్కల వారితో ఇట్టే కలసిపోయేది. అపార్ట్ మెంట్ లలో ని పంజాబ్, ఒరిస్సా, తమిళ్నాడు, కేరళ, కర్నాటక ఎవరైతే నేం? ఈమెకు తెలిసిన భాష ఈమె మాట్లాడేది. వాళ్ళకు తెలిసిన భాష వాళ్ళు మాట్లాడే వాళ్ళు. సైగలతో అర్థం చేసుకునేవారు. ఈమె వంటలు వారు నేర్చుకునేవారు. వారి వంటలు; పిండి వంటలు ఈమెకు నేర్పేవారు. వచ్చీరానీ భాషలో అన్ని భాషల పదాలు కలిపి వాళ్ళు మాట్లాడుకునే తీరు విని తరించడం ఎంతటి భాగ్యం?

మగవారు ఆఫీస్ లకు పోయాక చుట్టుపక్కల వారితో మహిళా సమావేశాలలో - ఆయా రాష్ట్రాల పండుగలు, పబ్బాలు, సంప్రదాయాలు; ఆచార వ్యవహారాలు; వారి వారి పుట్టింటి; మెట్టింటి గొప్పలు; తిప్పలు ...ఆయా రాష్ట్రాల రాజకీయాలు; సినిమాలు... ఒకటేమిటి? - అన్ని విషయాలు చర్చకు రావాల్సిందే. ప్రతిరోజూ మహిళా సమావేశాలు; చర్చలు; కలసి షాపింగ్స్.

ఇక రాత్రయితే - నేను ఆఫీస్ కు పోయి; తిరిగొచ్చేంత వరకు ఎవరెవరితో ఏమేమి మాట్లాడింది. ఎలా టైం పాస్ అయింది పూస

గుచ్చినట్లు చెప్పాల్సిందే.

కాలమే తెలిసేది కాదు. ఏంటో! అలా గడచిపోయింది జీవితం! వెనక్కి తిరిగి చూసే లోపలే రిటైరైపోయాను.

మొత్తానికి ఏదైతే రాకూడదని ఆమె చెబుతూ వచ్చిందో అన్నీ వచ్చేశాయి. బి.పి, షుగర్,అల్సర్ లే కాదు అదనంగా చెవులకు మిషనూ; చేతికి కర్రా, కళ్ళకు అద్దాలు కూడా వచ్చాయి. అంతా ఆమె ప్రసాదమే అని నేనంటాను. కాదు మీ వయసు ప్రభావం అని తనంటుంది. అయినా… ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. నిజంగానే … నాకిప్పుడు నల భీమ పాకమైనా రుచించదు. అంటే మా ఆవిడ అలాంటి గొప్ప వంటకాలేవో చేసేస్తుందని కాదు. ముప్పయి ఏళ్ళుగా అలవాటుపడిపోయాను మరి! ఆ వంటలతో…ఆమె మాటలతో!




"పెంటపాలెం"

కండక్టర్ అరుపుతో లేచి బ్యాగ్ తీసుకుని బస్ దిగాను.

రోడ్డు పక్కన చెట్లతో, పుట్లతో నిండి ఏటవాలుగా క్రిందకి వుండే ఒక కిలోమీటరు ప్రదేశాన్ని దాటి వెళితే మా పెంటపాలెం వస్తుంది.

బస్టాప్ లో దిగితే చాలాదూరం..అదే ఇక్కడ దిగితే మా ఇంటికి తొందరగా వెళ్ళిపోవచ్చు.

నేను హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. నన్ను మానాన్నగారు పొలం పనులు చూసుకుంటూ కష్టపడి చదివించారు. ఒక్కడ్నే కొడుకుని. నేనూ నా జీవితాన్ని నిర్లక్ష్యంతో నాశనం చేసుకోకుండా చక్కగా చదువుకుని పైకొచ్చాను. సెలవుదొరికినప్పుడల్లా అమ్మానాన్నల దగ్గరకి వచ్చేస్తాను. వాళ్ళ ఆప్యాయత..స్వచ్ఛమైన పల్లె వాతావరణం మనస్పూర్తిగా చవిసూసి మళ్ళీ యాంత్రికంగా బ్రతకడానికి సిటీ కెళతాను.

గబ గబ నడుచుకుంటూ వెళుతున్న నాకు కొద్దిదూరంలో జామచెట్టెక్కి చిటారు కొమ్మనున్న పండు అందుకోవడానికి తాపత్రయ పడుతున్న పిల్లాడొకడు కనిపించాడు. పండుమీదున్న యావతో కొమ్మమీంచి పడిపోతాడన్న విషయం పట్టించుకోవడంలేదు. పోనీ నేను 'జాగ్రత్త'ని అరచి చెబుదామంటే.. 'ఎవరో పెద్దవాళ్ళు తనని కొట్టడానికి వస్తున్నారనుకుని' బెదిరి హడావుడిగా చెట్టుమీంచి దూకే ప్రయత్నం చేస్తాడు. అదీ ప్రమాదమే!. అందుకే వాడికి కనిపించకుండా మరో పక్కగా వాడి వైపు పరిగెత్తాను. నేనక్కడికి చేరుకునే సరికి జరగకూడని ప్రమాదం జరిగిపోయింది. వాడు చెట్టుపైనుండి జారి పడిపోయాడు.

తగలకూడనిచోట దెబ్బ తగలడంతో వాడిప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది. నా కళ్ళలో ధారాపాతంగా కన్నీళ్ళు. వాడు యాదమ్మ మనవడు. చిన్నప్పుడే వాడి అమ్మానాన్నలు పంటకి ఎరువులు కొనుక్కురావాలని బస్సులో వెళుతూ ప్రమాదంలో మరణిస్తే, యాదమ్మే కంటికి రెప్పలా కాపాడుకొస్తోంది. వాడు చచ్చిపోయాడని తెలిస్తే ఆ ముసలి ప్రాణం తట్టుకోలేదు. అందుకే వాడి శరీరాన్ని అక్కడ బాగా చెట్లతో అల్లుకుపోయిన ప్రదేశం మధ్య వున్న బండరాయిమీద పెట్టాను. అది ఎవరికీ కనిపించదు. తర్వాత యాదమ్మకి ఆ విషయం నిదానంగా 'ఎలా చెబితే మంచిదో ఆలోచించి, అలా చెబుదామని' నిర్ణయించుకున్నాను.

వాడి శరీరాన్ని బండమీద జాగ్రత్తగా పడుకోపెడుతుంటే నాకో ఆలోచన వచ్చింది. అదేమిటంటే! నాకు ఊజాబోర్డు..ఇ ఎస్ పి ప్రయోగాలు..చేయడం సరదా..అలాగే పరకాయప్రవేశం గురించి ఆసక్తితో..క్షుణ్ణంగా చదివి వున్నాను. దానిని సాధించాలంటే అప్పుడే ఆత్మ వదిలిన శరీరం కావాలి. ఇన్నాళ్ళూ అది దొరకలేదు. అందువల్ల సాధన చేయలేకపోయాను. ఇప్పుడు దొరికింది. అంతేకాదు ఈ పిల్లాడి శరీరంతో యాదమ్మ ఇంటికెళ్ళి కాసేపు మురిపించి..ముచ్చట్లాడి..ఆవిడకేదో బాగా కోపమొచ్చే పనిచేసి 'నేను ఊరినుండి పారిపోతున్నానని' వెళ్ళిపోతే..కొన్నిరోజులు వెతుకుతారు..ఆతర్వాత మరచిపోతారు. కానీ యాదమ్మ ప్రాణానికి ప్రమాదమేమీ వుండదు. ఈ ఆలోచన నచ్చింది.అప్పటిదాకా బాధగా వున్న మనసులో ఒకింత ఆనందం.

ఆ శరీరానికి కాస్త దూరంలో కూర్చుని మంత్రాలు చదవడం ప్రారంభించాను.

నా శరీరం బాగా బరువెక్కి, తేలికగా వున్న ఆత్మ శరీరం నుండీ విడివడుతున్న అనుభూతి. అలా ఆత్మగా ఆ ఏడేళ్ళ పిల్లాడి శరీరంలోకి ప్రవేశించాను. నాకు ఆశ్చర్యంగా వుంది. ఇరవైరెండేళ్ళ నేను ఇప్పుడు ఏడేళ్ళ శరీరంలో. తేలికగా వున్న శరీరంతో లేచాను..చిన్న పిల్లాడి మనస్థత్వంతో కాసేపు అటూ ఇటూ ఎగిరాను. దూరంగా వున్న నా శరీరాన్ని చూసుకున్నాను. ఎవరికీ దక్కని అదృష్టం. నా పార్థివశరీరాన్ని నేనే చూసుకోవడం. నా శరీరాన్ని జాగ్రత్తగా భద్రపరచుకున్నాను. లేకపోతే నేను మళ్ళీ నా కాయంలోకి పునఃప్రవేశం చేయలేను.

అలా పిల్లాడి మనసుతో ఎగురుతూ..గెంతుతూ..తుళ్ళుతూ..వెంకన్న పొలంలోకి అడుగెట్టాను..ఆకాశంవంక..పక్షుల వంకా..ఎత్తైన చెట్ల వంకా చూస్తూ ఉరకలెత్తుతున్న నేను..ఉన్నట్టుండి కాళ్ళూ..చేతులూ..శరీరం..రాసుకుపోతూ..అగాథంలోకి జర్రున జారిపోతున్నాను. నాకేం జరుగుతూందో అర్థం కావడంలేదు. మెదడు స్తబ్దమైపోయింది. కొంతదూరం తర్వాత అలాగే నిలుచున్న భంగిమలో నేలపొరల్లో ఇరుక్కుపోయాను. అర్థమైంది. నేను బోరుబావిలో పడిపోయాను. గుండె ఆగినంత పనైంది. ఎప్పుడూ టీవీల్లో చూడడం తప్ప ఊహించను కూడా ఊహించలేదు. భయంకరమైన పాతాళ అనుభవం.

కాళ్ళూ చేతులు కదపలేను. దురదొస్తే గోక్కోలేను. కన్నీళ్ళొస్తున్నాయి. పిచ్చిగా అరుస్తున్నాను. ప్రయోజనమేంటి? నన్నెవరన్నా రక్షిస్తారా? అసలు నేను పడిపోవడం ఎవరన్నా చూశారో లేదో. చీకటి..చిమ్మ చీకటి..బయట అంత వెలుగుంటే ఇక్కడ ఇలా! అన్నట్టు నేను పరకాయ ప్రవేశం చేసి కదా ఈ శరీరంలోకి వచ్చింది. 'హమ్మయ్య నా శరీరంలోకి నేను మళ్ళీ వెళ్ళిపోవచ్చు' అనుకుని మంత్రం చదువుదామంటే..గుర్తురాదే!మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాను..ఊహూఁ..భయంతో నాలుక పిడచ కట్టుకుపోయింది. గుండె ఆగిపోతున్న భావన. కొద్దిసేపు మంత్రాలని గుర్తు చేసుకునే ప్రయత్నం చేసి మానేశాను. ముందు మనసుని స్థిమిత పరచాలి. అప్పుడే ఏదన్నా సాధ్యం.

నాకు తెలిసి నేను దీంట్లో పడి చాలా సేపయింది.

కుర్చీలో కూర్చుంటే పదిసార్లు మెసులుతుంటాం..అలాంటిది ఒకే భంగిమలో ఇలా... శరీరం తిమ్మిరెక్కిపోయింది. ఏవో కాళ్ల మీదా చేతులమీదా కుడుతున్నాయి. వాటిని పక్కకి తప్పించలేను..జీవత్వంలో..నిర్జీవత్వం! దాహమేస్తోంది..ఆకలేస్తోంది. జారుతున్నప్పుడు రాసుకుపోయిన శరీరభాగాలు మండుతున్నాయి. బహుశా రక్తం కూడా కారుతోందేమో..తలకాయ మాత్రం కొద్దిగా కదల్చ గలుగుతున్నా! మామూలుగా మన శరీరభాగాలు కదుల్తూ ఉంటే మనకి తెలియదు కాని..అంగాల కదలిక ఎంత అద్భుతమో! పోనీ కాసేపు నిద్రపోయి మర్చిపోదామనుకున్నా నిద్రరాదే! అమ్మా నాన్న ఏంచేస్తున్నారో?..నేను వస్తున్నానని పాపం వాళ్ళకి తెలియదు కదా! నేను అక్కడ హాయిగా వున్నాననుకుని వుంటారు. వాళ్ళకి కొద్ది దూరంలో నా మనసు..మరో కొద్దిదూరంలో నా శరీరం వుందని పాపం తెలియదు. కళ్ళు అవిశ్రాంతంగా వర్షిస్తున్నాయి.

మళ్లీ మంత్రాన్ని గుర్తు చేసుకునే ప్రయత్నం చేశాను..ఊహూ!గుర్తురాలేదు.

నేనిలా దీనిలో పడి ఎంతసేపయ్యిందో.

పోనీ ఈ నరకం తప్పించుకుందామని ఆత్మహత్య చేసుకుందామనుకున్నా, ఏమీ చేసుకోలేని పరిస్థితి. క్షణాలు భా..రం..గా గడుస్తున్నాయి.

అంతలో పైన చిన్నగా ఏవో చప్పుళ్ళు మొదలయ్యాయి. హమ్మయ్య! నన్ను రక్షించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నమాట! ఒక సూర్యకిరణమంత ఆశ మనసుని ఆహ్లాదపరచింది. మళ్ళీ అంతలోనే 'దానికి వాళ్ళెంత సమయం తీసుకుంటారో? నేను పడిన గోతికి సమాంతరంగా గొయ్యి తవ్వాలి. దానికి కావలసిన పనిముట్ల సరంజామా సిద్ధంగా వుండాలి. తవ్వుతున్న సమయంలో వాళ్ళకి ఎటువంటి రాళ్ళు రప్పల అడ్డంకి రాకూడదు. వస్తే మళ్ళీ తర్జన భర్జనలు. ఆలోపల తిండీ తిప్పలు లేక సొమ్మసిల్లిపోయే తన ప్రాణం.. పోనే పోతుంది. అప్పటిదాకా కలిగిన ఆశ కాస్త అడుగంటిపోయింది.

ఎవరో ఆక్సిజన్ పైపనుకుంటా లోనికి వదిలారు..కొద్దిగా గాలి పీల్చుకో గలుగుతున్నాను..మెదడు స్థబ్దత నుండి కొద్దిగా చైతన్యాన్నందింది.

కింద కాలినేదో కొరుకుతోంది. భగవంతుడా ఎంతసేపీ ప్రత్యక్ష నరకం?

మనసు కుదుట పరచుకుని..ఏకాగ్రతతో..మళ్ళీ పరకాయ ప్రవేశ మంత్రాలు జ్ఞప్తికి తెచ్చుకున్నాను. వచ్చేశాయి. నా ఆనందం అంతా ఇంతాకాదు. ప్రాణం మీద తీపితో..నరకం నుండీ తప్పించుకోవాలన్న తపనతో మంత్రంలోని ప్రతి అక్షరం స్పష్టంగా ఉచ్ఛరించాను. శరీరంనుండి ఆత్మ విడివడింది.

ఆఘమేఘాలమీద నా శరీరంలోకి ప్రవేశించాను.

కళ్లల్లోంచి బాధా ఆనందంలతో కూడిన కన్నీళ్ళ ప్రవాహం. చచ్చిబ్రతికాను మరి. టైం చుసుకున్నాను. బోరుబావిలో అయిదుగంటలున్నాను. కాని ఒక జివితకాల నరకమనుభవించి వచ్చిన బావన.

వేగంగా బోరుబావి దగ్గరకి వెళ్లాను. ఊరివాళ్ళతో..విషయం తెలుసుకుని వచ్చిన వాళ్ళతో..టీ వీ, పేపర్ వాళ్ళతో క్రిక్కిరిసిపోయి..హడావుడిగా వుందా ప్రదేశం. నేనే ఇందాకటిదాకా ఆ బోరుబావిలో వున్నానని తెలిస్తే వీళ్ళెలా రియాక్ట్ అవుతారో? అసలు నమ్ముతారో లేదో?

యాదమ్మకి వాళ్ళ మనవడు అందులో పడ్డాడని ఎవరు చెప్పారో గానీ కన్నీరు మున్నీరవుతోంది. ఆవిడ్ని చూస్తే కడుపు తరుక్కుపోతోంది. పోన్లే ఇదీ ఒకందుకు నయమే..వాడు బోరుబావిలోనే పడి మరణించాడనుకుంటుంది. వాడి చావు వార్త వినడానికి క్షణ క్షణానికీ మానసికంగా సన్నద్ధురాలవుతుంది.

నా దగ్గరగా వచ్చిన ఒక విలేఖరి "సార్! ఈ బోరుబావి మరణాలు ఎంతోమంది పిల్లల ఉసురు తీసుకుంటున్నాయి. వీటినరికట్టడానికి ప్రభుత్వమూ..మనమూ ఏం చేయాలి?"అన్నాడు మైకు ముందుకు తీసుకొస్తూ!

"బోరుబావిలో పడడమన్నది భయంకర నరక అనుభవం. అది మాటల్లో చెప్పలేం. బోరుబావి ఎవరు తవ్వించినా, అది నిరుపయోగమని తెలిసినప్పుడు..అందులో వాళ్ళ పిల్లలు..మనవలూ పడినట్టు ఊహించుకుంటే..అది కప్పేస్తే గాని ఇంటికెళ్ళలేరు. మనలాంటి వాళ్ళు ఎప్పుడో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు స్పందించడం కాకుండా..ప్రమాదకర బావుల్ని గమనించి పూడిపించాలి. అంతేకాదు మనిషి మనుగడకి ప్రమాదహేతువైన దేనిపట్లా నిర్లక్ష్యం పనికిరాదు. అకాలమరణాలని అరికట్టడమనేది ఒక ఉద్యమంగా రూపొందించాలి. కడుపు శోకం ఎవరిదైనా ఒక్కటే! ఏమీ తెలియని పసితనం కంటిముందు బావిలో దిగబడిపోయివుంటే..కన్నవాళ్ల బాధ వర్ణణాతీతం. దయచేసి బోరుబావి లేని ప్రదేశంగా మన రాష్ట్రాన్ని..దేశాన్ని తీర్చిదిద్దాలి..గొట్టపుబావి మరణాలని అరికట్టాలి"అన్నాను బాధతో గొంతు పూడుకుపోతుంటే!

అక్కడే వున్న వెంకన్న నా మాటలు విని కళ్లనీళ్లపర్యంతమయ్యాడు. అవునుమరి అతడు పూడ్చకుండా వదిలేసిన బోరుబావి అంతమందిని బోరున విలపించేలా చేస్తుందనుకుని వుండడు. అక్కడున్న వాళ్ళందరూ ఆ పిల్లాడు బ్రతికుండాలని ప్రార్థనలు చేస్తూ..యాదమ్మను ఓదారుస్తూ కూలబడ్డారు.




ఎన్నో సంవత్సరాల తర్వాత సంక్రాంతి పండక్కి తమ ఊరికి వెళ్ళబోతున్నామని తండ్రి చెప్పగానే ఎక్కడలేని ఉత్సాహమూ కలిగింది ఎనిమిదోతరగతి చదువుతున్న రవికి. ఎప్పుడెప్పుడు సెలవులొస్తాయాని ఎదురుచూడసాగాడు. ఆరోజు రానేవచ్చేసింది..ఉదయాన్నే లేచి ఆటోలో రైల్వేస్టేషనుకి చేరుకున్నారు, రవి, అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్, లక్ష్మి. ట్రైన్ కదలగానే రవికి ఎంతో ఆనందం కలిగింది. "డాడీ, మన ఊరు ఎలా ఉంటుంది? " అనడిగాడు తండ్రిని. శ్రీనివాస్ ఇలా చెప్పసాగాడు. " దేశానికి అన్నం పెట్టే అమ్మల్లాంటివి పల్లెలు. పచ్చని పంటపొలాలకూ, ప్రేమానురాగాలకూ ప్రతీకలు. ప్రత్యేకంగా సంక్రాంతప్పుడు ఎటుచూసినా కనిపించే సంబరాలు చూడడానికి రెండుకళ్ళూ చాలవనుకో...." ఇది వినేసరికి రవిలోని ఉత్సుకత మరింత పెరిగింది. తీరా రైలు దిగి తమ ఊర్లో అడుగు పెట్టగానే కనిపించిన దృశ్యం తండ్రి చెప్పినదానికి పూర్తి విరుద్ధంగా కనిపించింది. ఏదో అడగబోయిన రవి తండ్రి మొహం చూసి ఆగిపోయాడు. కారణం, శ్రీనివాసే అయోమయంగా దిక్కులు చూడడం గమనించి.

కూలిపోయిన పెంకుటిళ్ళు కొన్ని, ఆధునికంగా వెలసిన అపార్ట్ మెంట్లు కొన్ని, పంటపొలాల సంగతి దేవుడెరుగు, చెట్టూ-చేమా లేవు కనుచూపుమేరలో. వీళ్ళని గుర్తుపట్టేందుకుగానీ పలకరించేందుకుగానీ పాతవారెవరూ లేరు. దాహం కావాలంటే

కొనుక్కోవడానికి కూల్ డ్రింక్ షాపులు....మజిలీ చేయడానికి లాడ్జీలు...తాను తిరిగిన పరిసరాలు గానీ, పూరిండ్లు గానీ ఏవీ లేవు....

మధ్యాన్నం దాకా అటూ-ఇటూ తిరిగి అలసిపోయారు ముగ్గురూ. ఏదోక లాడ్జిలో తప్ప ఎక్కడా ఉండే పరిస్థితి లేదు. ఈమాత్రం దానికి ఇక్కడెందుకు, మనింటికే వెళదామని వెనుదిరిగారు.

ట్రైన్ లో కూర్చుని కళ్ళుమూసుకున్న శ్రీనివాస్ కి తమ చిన్నప్పటి పల్లె మనసులో మెదిలింది. చెరిగిపోయిన పల్లె గుర్తులపై వెలసిన ఆధునిక అంతస్థులు ఏదోలా అనిపించింది. మెల్లిమెల్లిగా వాస్తవం అతడికే స్ఫురించసాగింది. కవులూ, చిత్రకారుల వర్ణనల వరకు పల్లెలు బానే ఉంటాయి. వాస్తవానికే పరిస్థితి భిన్నంగా ఉంటుంది....కాలంతో పరిగెత్తే మనిషి ఆలోచన నిన్నటికంటే మిన్నగా ఉండాలని కోరుకుంటుంది. అభివృద్ధి కోసం పట్టణాలవైపు వలస వెళ్ళేలా చేస్తుంది...వీలైనంతకాలం అక్కడే ఉండి ఆర్జన సాగిస్తాడు. మనసు మళ్ళితే తన పల్లె వైపు తొంగి చూస్తాడు... వచ్చినా ఇక్కడ ఉండలేడు. ఉండాలంటే ఇంతకాలం పట్నంలో తాను అనుభవించిన ఆధునిక హంగులను పల్లెకి పరిచయం చేస్తాడు....ఇక విస్తరించిన పట్టణీకరణ పల్లె గుర్తులను చెరిపేసి కొత్త రూపు సంతరించుకుంటుంది. ఒడిదుడుకుల వ్యవసాయం భారమై రియల్ ఎస్టేట్ కు బలైపోతుంది. పంట పొలాలు వెంచర్లై వెలుస్తాయి...తదనుగుణంగా వ్యాపారసముదాయాలు వచ్చివాలతాయి...ఎవరినని ఏం లాభం? ఎవరి లాభం వారిది....ఎవరి స్వార్థం వారిది..ఎవరి అభివృద్ధి వారిది....ఇందులో నాపాత్రా ఉంది..." అనుకున్నాడు తాము అమ్మేసిన పాతకాలం నాటి పెంకుటిల్లు స్థలంలో వెలిసిన అపార్ట్ మెంట్ తలచుకుంటూ...

ట్రైన్ పరిగెడుతూనే ఉంది....పట్నం లాంటి పల్లె నుండి....... పట్నం వైపు..



“కర్నూల్ – హైదరాబాద్” నాలుగు గంటల ప్రయాణం తరువాత హైదారాబాద్ యం.జి.బి.యస్ లో బస్సు దిగాం

నేను నా ఫ్రెండ్ ఈశ్వర్.

అర్ధరాత్రి 12 దాటింది. సమయం 1:30 నిముషాలు

నిద్రలో పోరాటం మాది ... జీవన పోరాటం వాళ్లది

వస్తున్న నిద్రను ఆపుకుంటున్న మేము ... వస్తున్న ఉదయాన్ని ఆగమంటున్న వాళ్ళు

సి.బి.యస్ నుంచి ఉస్మానియా వరకు ఆటో ... ఎవ్వరూ రెండు వందలు రూపాయలు తగ్గటం లేదు

రాత్రి సమయం కదా...

1,2,3,4 ... ఎంతమంది ఆటోవాళ్లను అడిగినా రెండు వందలు...

ఎంత ఐక్యమత్యమో... తెలంగాణా , ఆంధ్ర అని తన్నుకుంటున్న సమయంలో...

వచ్చిన వాడు ఎవడైతేనేం ... ఎవడైనా సరే ... రెండు వందలు

చెరో పది... మహాయితే ఇరవై రూపాయల టిక్కెట్ కోసం... రెండు వందలు ఇవ్వాలా ?

చూస్తూ చూస్తూ రెండువందలు ... అక్షరాల రెండువందలు... కష్టంగా అనిపించింది ... మరీ దారుణం అనిపించింది...

ఆంగ్లంలో ఇట్స్ వెరీ టూమచ్ అనిపించింది. ఇవ్వలేమంటున్న మేము, ఈ సమయంలో ఇక్కడినుంచి అక్కడికి ఏమీ ఉండవంటున్న వాళ్ళు ... మాటల్లో పడి మొత్తమ్మీద మూడుకిలోమీటర్లు నడిచాం...

*****

అంతా చీకటి... దానిని తరిమేందుకు దారిపొడవునా ఎలక్ట్రిక్ దివిటీ...

మా అడుగుల చప్పుడు తప్ప మరేమీ వినిపించడం లేదు మాకు

ఎంత నిర్మానుష్యంగా ఉందో... ఎంత నిశ్శబ్దంగా ఉందో...

ఒక పక్క పుస్తకాలమ్మే వాళ్ళు... మరోపక్క ఆపాదమస్తకాలూ చూసేవాళ్ళు...

ఒక పక్క గాజులు... మరోపక్క సన్నజాజులు...

వేడి వేడి ఇడ్లీలు ... బజ్జీలు... గరమ్ గరమ్ ఛాయ్...

చలచల్లని ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్, ఫ్రూట్ జ్యూస్...

ఒకపక్క హ్యాండ్ లూమ్స్ , ఒకపక్క హ్యాండ్ బ్యాగ్స్...

మనం అడక్కపోయినా రండి రండి మీదే బోని అని పిలిచే జీవన పోరాట కర్తలు....

చిన్న పిల్లలు, ముసలివాళ్లు, ఆంటీస్, అంకుల్స్ ... పాలిచ్చే అమ్మలు, చెయ్యి పట్టుకునే నాన్నలు

అన్నింటినీ మించి హోళీ నడిచొస్తుందా అనిపించే అమ్మాయిల సమూహాలు, వాళ్ళ నవ్వుల ప్రవాహాలు...

ఒకరినొకరు రాసుకుంటూ, ఒకరినొకరు నొకరు చూసుకుంటూ...

వచ్చేవాళ్లు , పోయేవాళ్లు... వచ్చి పోయేవాళ్లు , పోయి వచ్చే వాళ్ళు...

ఎక్కేవాళ్లు, దిగేవాళ్లు, ఎక్కిదిగే వాళ్ళు, దిగి ఎక్కే వాళ్ళు, మనుషులు, వారి మనసులు, బరువెక్కిన పాపపు ఆలోచనలు... అన్నిటినీ నింపుకొని, అలుపూ... సొలుపూ లేకుండా ప్రయాణించే బస్సులు ...

అల్లకల్లోలంగా ఉండే నగరం...

గందరగోళంగా ఉండే నగరం...

గరమ్ గరమ్ గా ఉండే నగరం...

భిన్న స్వరాలను వినిపించే నగరం... నిద్ర పోతుంది.

అవును నగరం నిద్రపోతుంది. ఎవరూ వినని స్వరాన్ని వినిపించడం కోసం... నగరం నిద్ర పోతుంది.

ఎంత నిర్మానుష్యంగా ఉందో... ఎంత నిశ్శబ్దంగా ఉందో...

*****

దీనంగా... హీనంగా... నీచంగా... వినిపిస్తున్న ఆస్వరం వింటుంటే భయమేస్తుంది, బాధేస్తుంది.

మేమిద్దరమే...

మూడోజీవి అక్కడ కనిపించడం లేదు... మూడో శ్వాస అక్కడ పయనించడంలేదు.

నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో మాకు అప్పుడే అర్ధమయ్యింది.

మా మాటలతో దానిని ఛేదించాలని ప్రయత్నిస్తున్నా... మా గుండెల్లో మాత్రం నిశ్శబ్దమే మిగిలింది.

అంతకు ముందు మాకు ఎదురైన సంఘటన అలాంటిది

ఒక్కసారి వెనక్కి తిరిగిచూశాం...

ఏంట్రా బాబు ఉస్మానియా వరకు నడిపిస్తావా ?!

నడవరా బాబు రెండువందలు మిగులుతాయిగా!

నడిచే ఓపిక లేదురా నాయనా ... పోతే పోయినాయ్ రెండొందలు ఏదైనా ఆటో మాట్లాడరా...

ఇలా మాట్లాడుకుంటూనే మా నడకను కొనసాగిస్తున్నాం

ఇంతలో...

వెనుక నుంచి... ఏయ్.... ఎక్కడి వరకు బావలూ... అనే పిలుపుతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాం.

మమ్మల్ని తోడు రమ్మంటారా ?! అంటూ వాళ్ళు మా వెనుకే వస్తున్నారు. మేము మాత్రం ఏమి మాట్లాడలేదు.

నాకు మాత్రం భయంగా ఉంది. మావాడు మాత్రం ధైర్యంగానే వెనక్కి తిరిగాడు , నేను మాత్రం కాస్త దూరంగా వెళ్ళి ఆగాను. ఏదో మాట్లాడుతున్నాడు. ఏం మాట్లాడుతున్నాడో తెలియదు. కాసేపటి తరువాత వాడు వాళ్ళకి డబ్బులిచ్చి మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు. మేము ముందుకు సాగాం. వాళ్ళు మళ్ళీ పిలిచారు. వెనక్కి తిరిగి చూశాం. "వాళ్ళు నవ్విన నవ్వు ఇంకా నా గుండెల్లో అలా మిగిలిపోయింది." భగవంతుడు వాళ్లను హిజ్రాలుగా పుట్టించినా, ఇంట్లో వాళ్ళు వాళ్ళని మెడబట్టి గెంటేసినా, అటు ప్రభుత్వాలు కానీ, ఇటు స్వచ్ఛంద సంస్థలు కానీ వారికి సరైన స్థాయిలో ఉపాధి కల్పించకపోయినా, అవమానాలు, చీదరింపులు, ఛీత్కారాలు అనుక్షణం వాళ్ళ వెన్నంటే ఉన్నా... చావకుండా బ్రతుకుతున్న వాళ్ళను చూస్తుంటే ఆశ్చర్యం వేసింది. మగాళ్ళుగాపుట్టి, ఆడాళ్ళుగాపుట్టి ఉన్నత చదువులు చదువుకొని చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్య చేసుకునే వాళ్ళకి అటు ఆడ, ఇటు మగా కాకుండా జీవన పోరాటాన్ని సాగిస్తున్న వీళ్ళ జీవితాలు పాఠాలు, గుణపాఠాలు నేర్పితే అంతకంటే కావాల్సిందేముంది అనిపించింది. అందుకే నవ్వుతున్న వాళ్ళను చూసి మాట్లాడాలనిపించింది.

ఆగాను...

అడిగాను...

"ఇలా పుట్టినందుకు బాధగా లేదా ?"

"మేమూ మనుషులమేగా..."

వాళ్ళ సమాధానానికి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. అంతలోనే అందరూ మాలా ఉండరు బావా!!! అనే సరికి గుండె గుభేల్ మంది. గమ్యాన్ని చేరేలోపు ఇంకా ఎంతమంది ఎదురవుతారో అనే భయంలోపల ఉన్నా ధైర్యంగానే ముందుకెళు తున్నాం. ఎందుకంటే వాళ్ళూ మనుషులే కదా!

*****

నిద్ర కళ్ళలో నడుస్తున్న మాకు... నిద్ర మత్తెక్కి, కళ్ళు వగరెక్కి, తాగిన వాళ్లలా నడుస్తున్న మాకు 'మత్తువద లరా, నిద్దుర మత్తువదలరా' అనేలా తగిలిన షాక్ మా నిద్దురకొండెక్కేలా చేసింది. వాళ్ళ గురించి, వాళ్ళ జీవితాల గురించి, సమాజంలో వాళ్ళు పడుతున్న అవమానాల గురించి చర్చించుకుంటూ ముందుకు సాగుతున్నాం...

మంచి ఎత్తు, ఎత్తుకు తగిన లావు... ఎంత అందంగా ఉందో నిమ్మపండు రంగు ఛాయ... చూడగానే... చూస్తు న్నవాళ్లు చూస్తున్నట్టుగా శిలలుగా మారిపోయేలా... వెన్నెల రాత్రి కదా! ఒంటరి చీకటి కదా! తుంటరి ఆలోచనలు కదా! నిమ్మపండు ఛాయ కదా! అందుకేనేమో ...."మాకంటే వయసు పెద్దదే... కాని మల్లెపూల వాసనకు మనసు వెనుక ఉన్న వయసు వద్దంటే వినదే..."

"కరెంట్ స్తంభం క్రింద, మల్లెల్ని వాలుజడతో సహా ముందుకు వేసుకొని, యద సంపద కనిపించేలా పైటను పైనుంచి జారవిడుచుకొని పిలుపులకు సిద్ధంగా, వలపుల పలుపులు పట్టుకొని చూస్తుంటే, తలపుల తలుపులు ఆగక కొట్టుకుం టుంటే మనసును, వయసును అదుపులో ఉంచుకొని నిష్ఠాగరిష్టులులా వెళ్లిపోతున్న మాకు... ఆ కరెంట్ స్తంభానికి ఉన్న విద్యుద్దీపం తను తాకడం వల్లనే అంత కాంతివంతంగా వెలుగుతుందా అనిపించింది.

"చూసి చూడనట్లే పోతున్నారు ... ఆగాలని లేదా!? ... మల్లెలతో ఆడాలని లేదా!? ... నాతో ,... ముందుకు సాగాలని లేదా!?" అంటున్నా మేము ముందుకు వెళుతూనే ఉన్నాం...

"సన్యాసులా లేక ఆశ్రమవాసులా లేక ...."

మావాడు దేనినీ వదలడు….

"ఆవిడ దగ్గరకు వెళ్ళి వయసులో పెద్దదానివి కదా వరసకావేమోనని ఆలోచిస్తున్నాం."

"మాలాంటి వాళ్ళకు వావివరసలు లేవు ఎవర్నీ కాదనము, ఏమడిగినా లేదనము…."

"నీకు పెళ్లైనదా ?"

"అవన్నీ నీకెందుకు నీకు కావాల్సింది నువ్వు తీసుకొని నాకు కావలసింది నాకు ఇవ్వు"

"ఏమడిగినా లేదనము అన్నావు కదా ?! అడిగిన వాటికి సమాధానం చెప్పు మాకు కావాల్సింది మేము తీసుకోక పోయినా నీకు కావాల్సింది నీకిస్తాం"

"చెప్పు నీకు పెళ్లైనదా ?"

"అయ్యింది."

"భర్త ఉన్నాడా?"

"ఉన్నాడు… ఉన్నా లేనట్లే… "

"పిల్లలు..?"

“ఒకకొడుకు, ఒక కూతురు.”

“రేపు నీ కూతుర్ని కూడా ఇలానే తయారుచేస్తావా ?”

“ఇప్పుడు నీ కొడుకొస్తే మాలానే వాడిని పిలుస్తావా ?”

నాకు మాత్రం వాడు మాట్లాడే మాటలకి కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి.

ఆవిడ ముఖంలో నెత్తురు చుక్క లేదు.

“క్షమించమ్మా నిన్ను చూస్తుంటే నీ వయసులోనే ఉన్న మా అమ్మ గుర్తొచ్చింది.! అమ్మని అలా ఎవరూ చూడాలనుకోరు కదమ్మా! అందుకే ఇలా మాట్లాడాను. నువ్వు భర్త ఉన్నా లేనట్లే అన్నావు. అప్పుడే అర్థమయ్యింది నువ్వు ఈ పని డబ్బు కోసమే చేస్తున్నావని, ఇష్టాపూర్వకంగా చేయడంలేదని. నీకు కావలసింది డబ్బే కదా! ఇదిగో తీసుకో అని ఎంత ఇచ్చాడో తెలియదు కాని ఇచ్చాడు. చాలాసేపు ఆవిడ తీసుకోలేదు. సొంతకొడుకులాగా చేతిలో పెట్టి వెనక్కి తిరిగాడు. మేము వెళ్లిపోతున్నాం. ఒక్కసారి ఆవిడని చూడాలనిపించి వెనక్కి తిరిగి చూశాను. ‘చేతులెత్తి దండం పెడుతుంది…ఆమె కళ్ళల్లో కన్నీళ్లు… జోడించిన రెండు చేతుల్ని కడిగేస్తున్నాయి.’ నాకనిపించింది తన పాపాలు ఈ రోజు తన కన్నీళ్లతోనే కడిగి వేయబడ్డాయని, మళ్ళీ పాపంచేయదని…”

“తాను పుండై వేరొకరికి పండై… తాను శవమై వేరొకరికి వశమై…” అనే కవితను తలచుకుంటూ మేము ముందుకు సాగిపోతున్నాం. సాహిత్యాన్ని చదువుకున్న, సమాజాన్ని చదువుతున్న విద్యార్థులం కదా!

*****

‘కొత్తొక వింత పాతొకరోత’ అన్నట్లు , ఇప్పుడు ఇంకో కొత్త విషయం దొరికింది మేము మాట్లాడుకోవడానికి …

పాత విషయం గతంలో కలిసిపోయింది ... అవును కదా మనిషి కొత్తది దొరికినప్పుడు పాతదానిని మరిచిపో తుంటాడు. ఇది చాలా సహజమైన విషయం. అలా మరిచిపోకపోతే అక్కడే ఉండిపోవలసి వస్తుంది.అక్కడే వాడిపోవలసి వస్తుంది. గాయాన్ని మాన్పుకోవాలంటే పడినచోట నుంచి అడుగులు వడివడిగా గమ్యంవైపు సాగిపోవాలి. పాత గాయాన్ని మాన్పుకోవడానికి కొత్త గాయాన్ని మందుగా వేశాం. పాపం మానభంగాలు, అత్యాచారాలు, కిడ్నాప్ లు, వరకట్న వేధింపులు, వేశ్యాజీవితాలు.... 33% రిజర్వేషన్ ఇలాంటి విషయాలలో బాగా అమలవుతుందనుకుంట. ఎప్పుడు మారుతుందిరా సమాజం. ఎప్పుడు మారుతుందిరా ఈ మనుషుల నైజం...ఇలా స్త్రీలను ఉద్ధరించే దిశగా ఆలోచిస్తూ అడుగులు చకచకా ముందుకు వేస్తున్న మేము ఆ దృశ్యాన్ని చూసి ఆగిపోయాం.

*****

““చలికాలంలో కూడా ఏసి రూముల్లో పడుకుని దుప్పటి కప్పుకునే వాళ్ళు....”

“మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ లో కూడా నాన్ వెజ్ తినే వాళ్ళు....”

“కుక్కలకుకూడా పిజ్జాలు, బర్గర్లూ పెట్టేవాళ్లు...” ఉన్న ఈ సమాజంలో రోడ్డుప్రక్కన పడిఉన్న అనాథలను, అభాగ్యులను పట్టించుకునే వాళ్ళు లేరు. ఒళ్ళు దాచుకోవడానికి సరైన బట్టలు లేక, కప్పుకోవడానికి దుప్పటి లేక, చెప్పుకోవడానికి నా అనే మనుషులు ఉండీ , లేక నిస్సహాయ స్థితిలో ఉన్న వాళ్ళను చావు కూడా చేరదీయడానికి వెనుకాడుతుంది. వయసు మళ్లిన ముసలివాళ్లను, వయసొచ్చిన కొడుకులు చూడకపోతే వాళ్ళ బ్రతుకులు ఎలా ఉంటాయనేది కొడుకులుగా ఉన్న మాకు తెలియడం కోసం విధాత ఆడుతున్న వింత నాటకమా ఇది అని అనిపించేలా ఎంత హృదయవిదారకంగా ఉందో...! కష్టపడి నలుగురు కొడుకుల్ని రెక్కలు ముక్కలు చేసుకొని చదివిస్తే ఆస్తులు అమ్ముకొని తలోదిక్కు వెళ్లిపోయి వీళ్లని మాత్రం దిక్కులేని వాళ్ళను చేశారట. చాలా బాధేసింది. మావాడు కప్పుకోవడానికి దుప్పటి ఇస్తే మాకొద్దు నాయనా మీరూ మాలాంటి తల్లిదండ్రులకి కొడుకులుగానే ఉన్నారు. వాళ్ళని మాలాంటి స్థితికి తీసుకురాకుండా చూసుకోండి. మీ దగ్గరనుంచే కాదు మీలాంటి కొడుకుల దగ్గరనుంచి మేము ఏమీ ఆశించం. మీరు పచ్చగా ఉంటే చాలు అదే మాకు పదివేలు....ఇక బయలుదేరండి.” అనే సరికి మాకు దిమ్మతిరిగింది. ఆ వయసులో కూడా, ఏమీ లేని స్థితిలో కూడా ఆముసలివాళ్ళకు ఎంత ఆత్మాభిమానం, వాళ్ళ మీద వాళ్ళకు ఎంత ఆత్మవిశ్వాసం. సిగ్గూ, ఎగ్గూ లేకుండా బ్రతికే మనలాంటి వాళ్ళకు వేలకు వేలు ఖర్చు పెట్టినా ఏ విద్యాసంస్థలు నేర్పగలవు ఆ విలువలు.

*****

‘అనుభవం పాఠాలు నేర్పుతుందంటారు’ మాకు ఎదురైన ఈ అనుభవాలు జీవితంలో ఎలాంటి పాఠాలు నేర్పుతాయో కానీ ఈ రాత్రి నిద్రను మాత్రం వదిలించాయి.

“పగలు భయంకరంగా ఉండే నగరం రాత్రి నిద్రపోతుందని, నిర్మానుష్యంగా ఉంటుందని అందరూ అనుకుంటారు. నిజానికి నగరం పగలే బావుంటుంది. రాత్రి భయంకరంగా బావురుమంటుంది. ఆ నిర్మానుష్యపు నీడల్లో జీవనపోరాటాల బ్రతుకు చిత్రాలు చిత్రాతి చిత్రంగా సాక్షాత్కరిస్తుంటాయి. ‘మన నీడను చూసి భయపడిపోయే మనమే భయపెట్టే నీడల్ని చూసి బాధపడుతుంటాం. మన గాయాల్ని చూసి బాధపడిపోయే మనమే బాధలలోయల్లో ఉన్నవాళ్లను చూసి జాలిపడుతుంటాం.’”

ప్రతి సంఘటనను చూసి చలించిపోతున్న మనం ఇప్పటికీ పురాణ వైరాగ్యంలోనే ఉంటున్నాం. అన్నీ చదివి పుక్కిట పురాణాలంటున్న మనం వాటి నుంచి నీతులు కొన్నైనా నేర్చుకోలేకపోతున్నాం.ఇప్పుడనిపిస్తుంది నిర్మానుష్యంగా ఉంది నగరం కాదు మన హృదయం.




అప్పటికింకా సెమినార్ ప్రారంభం కాలేదు. ఆడిటోరియం పలచగా ఉంది. సినిమా వాళ్ల కార్యక్రమమో, మ్యూజికల్ నైట్ లాంటిదో అయితే ఈ పాటికి కుర్రకారంతా అక్కడ మూగేవాళ్లే.

విద్యాసంబంధమైన అంశాలంటే సహజంగా ఉండే అనాసక్తి అక్కడ కనిపిస్తోంది. అన్ని వరసల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయి.

ఓ మూలగా ఫ్యాన్ కింద సీటు వెతుక్కుని కూర్చున్నాను.

రిసెప్షన్ దగ్గర ఇచ్చిన బ్రోచర్ తిరగెయ్యటం ప్రారంభించాను. వచ్చే అతిథులంతా ప్రతిభాసంపన్నులే. తమ రంగంలో విశేష కృషి చేసి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారే. ప్రారంభ కార్యక్రమానికి తక్కువ సమయం కేటాయించటం నాకు నచ్చింది. సాధారణంగా ఓ పూట అంతా ఉపన్యాసాలకే కేటాయించి, భోజన విరామం తర్వాత పత్రాల సమర్పణ, చర్చ లాంటి వాటికి వినియోగించటం అదో ఆనవాయితీ.దీనికి భిన్నంగా నేరుగా అంశాల్లోకి వెళ్లిపోవటం సమయాన్ని సద్వినియోగం చేయటమే అనిపించింది.

ఒక్కొక్కరు వస్తున్నారు. బహుశా వారంతా పరిశోధక విద్యార్థులనుకుంటా. ముందు వరసల్లో సర్దుకుంటున్నారు.

మన రాష్ట్రంలో పరిశోధక విద్యార్థుల అవస్థలు తలుచుకుంటే నాకెప్పుడూ ఆందోళన కలుగుతూంటుంది. నాలుగేళ్లో, అయిదేళ్లో కష్టపడి డాక్టరేట్ తెచ్చుకున్నా వారిని ప్రతిభావంతులుగా గుర్తించరు. ఉపాధిపరంగా పెద్దగా అవకాశాలుండవు. సాధారణంగా ఏ ఇంజనీరింగో చేసి సాఫ్ట్ వేర్ కంపెనీల్లో చేరితే వేలకు వేలు జీతాలు వస్తాయి. ఇతర సాంప్రదాయక కోర్సులు చేసినవారు ఏదో ఉద్యోగాల్లో సర్దుకుంటారు. పాపం ఈ డాక్టరేట్లే.. యూనివర్శిటీల్లో పోస్టులు భర్తీ చేసే పరిస్థితి లేక, ఉద్యోగాలురాక, ట్యూటర్ల గానో, టీచింగ్ అసిస్టెంట్లుగానో బతుకులు లాగించేస్తూంటారు. ఇంత కష్టపడి చేసిన డాక్టరేట్ వల్ల ఫలితం ఏమిటో అర్థం కాదు. పేరుకి ముందు 'డీఆర్ ' అని రాసుకోవటం తప్ప ... చాలా మంది కుమిలిపోవటం నేనెరుగుదును.

" ఏం రీసెర్చి లేద్దూ. వీళ్లు చేసి కృషి ఏముంటుంది. అంతకు మందు వచ్చిన రీసెర్చి మెటీరియల్ ని కత్తిరించి అతికించటం తప్ప.." అని పెదవివిరవటం...

" గైడ్ ని సంతృప్తి పరిస్తే చాలు. అతగాడే అన్నీ చూసుకుంటాడు. డాక్టరేట్ వచ్చి చేతిలో పడుతుంది" అని నిర్ధారించటం...ఆర్థికంగా, మానసికంగా సంవత్సరాల తరబడి ఒత్తిడి ఎదుర్కొని చిట్టచివరి మజిలీని విజయవంతంగా అధిగమించి డాక్టరేట్ పట్టా చేతికందుకున్న వారి చెవిన తరచూ పడే మాటలివి. మేధను గౌరవించని స్వభావం చుట్టూ ఉన్న సమాజంది. అది చదువుకున్నవాళ్లని చిన్నతనం చేస్తూంటుంది.

" ఒరే.. మనోడు వచ్చినట్టు లేదురా..." ఎవరో అరుస్తుంటే తలెత్తి ముందు సీట్ల వైపు చూశాను. నలుగురు కుర్రాళ్లు. ఒకటి రెండు

మాటలు విన్నాక అర్ధమైంది. వాళ్లు మాట్లాడుకుంటున్నది తమ రీసెర్చి గైడ్ గురించని.“ పిల్లలను స్కూలు నుంచి తేవటం నుంచి బ్యాంకుపని, ఇంట్లో సరుకులు తెచ్చే పని.. ఒకటేమిటి... పెద్దపాలేరులా అన్ని పనులు చేస్తూనే ఉన్నా. అయినా మా వాడు కనికరించటం లేదురా... నాలుగేళ్లయి పోయింది. సినాప్సిస్ సబ్మిషనే కావటం లేదు” నిర్వేదంతో అతను చెబుతున్నాడు.

“ నీ సంగతి సరే.. మా ప్రొఫెసర్ మాత్రం మనసులో ఏమనుకుంటాడో తెలిదు. ఒకసారి చెప్పిందానికి, రెండోసారి చెప్పేదానికి పొంతన ఉండదు. అసలు మెటీరియల్ కలెక్షన్ ఏ దిశగా సాగాలో అర్ధమై చావటం లేదు.” పెదవి విరిచాడు పక్కనున్నతను.“ నువ్వేదో ఉద్యోగం చేసుకుంటూ అప్పుడప్పుడూ వచ్చి పోతూ ఉంటావు. ఇక్కడే మగ్గే మా లాంటి వాళ్ల పరిస్థితి ఏమిటి?” ఇంకో అతను అందుకున్నాడు.“ డాక్టరేట్ అనిపించుకోవాలన్న దురద కొద్దీ ఇందులోకి దిగాను గానీ... రీసెర్చి చేయటం అంత బుద్ధి తక్కువ పని ఇంకోటి లేదు”... గొంతు పెంచి మరీ అన్నాడు మొదట మాట్లాడిన విద్యార్ధి.

ఈ లోపు ఓ వ్యక్తి అటుగా రావటంతో నలుగురు విద్యార్ధులు లేచి గౌరవపూర్వకంగా అతనికి నమస్కారం చేశారు. అతను వారి వైపొక సారి చూసి తలపంకించి ముందుకు సాగి పోయాడు.

“ ఈ ప్రొఫెసర్లంత కక్కుర్తి గాళ్లు ఇంకోళ్లు లేరు. డబ్బులిస్తే థీసిస్ అంతా రాసిచ్చే ప్రొఫెసర్లున్నారట. మొన్నామధ్య ఒకతను చెప్పాడు. బొటనీలో పిహెచ్ డి చేశాడు.

ప్రొఫెసరుకి బంగారు కడియం ఇచ్చానని... ”

“అవునోయ్... జూనియర్ కాలేజి,లేదా డిగ్రీల సైన్సు లెక్చరర్లయితే ట్యూషన్లు చెప్పి సంపాదిస్తారు. ప్రాక్టికల్ మార్కులుంటాయి... కాబట్టి విద్యార్థులు భయభక్తులతో ఉంటారు. సంపాదనకు మార్గంలేదని ఆర్ట్సు డిపార్టుమెంట్లు వాపోవటం నాకు తెలుసు. మరి ఈ ప్రొఫెసర్లను పట్టించుకునేవారెవరు?”

“ బలేవాడివే. వీళ్లకేం జీతాలకు కొదవా... లక్షలకి లక్షలు సంపాదిస్తున్నారు. పాఠాలు చెప్పినా చెప్పకపోయినా...

అప్పుడుప్పుడు పేపర్లు ప్రజెంట్ చేస్తూ మేం ఉన్నాం... అని చాటుకుంటూంటారు.

కొందరు ప్రొఫెసర్లకు ఆడపిచ్చి ఎక్కువ. తమకు లొంగితే తప్ప ఆడపిల్లల థీసిస్ సినాప్సిస్ దశ కూడా దాటనివ్వరు. ఏదో కొర్రీలు వేస్తూ పోతారు. చివరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. కొంత మందికి ఎక్స్ టెన్షన్ కూడా ఇవ్వరు. మరికొందరు ప్రొఫెసర్లుంటారు. డిపార్టుమెంటులో ఒకరో ఇద్దరో అమ్మాయిల్ని ...వీళ్లంతా చెడిపోయారని కాదు నా ఉద్దేశం... ఎదురుగా కూర్చోబెట్టుకుని సొల్లు కబుర్లు చెబుతూంటారు. బయటకు పోయినప్పుడల్లా వీళ్లని పక్కన వేసుకుని పోతూంటారు. ఇక స్త్రీత్వం పెట్టుబడి పెట్టి మరీ కొందరు త్వరగా డాక్టరేట్ పొందాలనుకునేవాళ్లుంటారు. అలాంటి వాళ్ల కోసం వెదికే ప్రొఫెసర్లున్నారు.''

'' ఏమో గురూ... ఈ గొడవలేమీ నాకు తెలియవు. ఎక్కడో ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాను. ప్రొఫెసరు రమ్మనప్పుడల్లా వచ్చేవాడిని. రూంలో నాలుగయిదు రోజులుండి ఆయన చెప్పినట్టల్లా చేసేవాడిని. ఈ లంచగొండితనం, పీడించటం లాంటి ప్రభావాలేమీ నాపైన పడలేదు. డాక్టరేట్ నా చేతిలో పడింది. అది నా ఉద్యోగానికి ఏ మాత్రం ఉపయోగపడకపోయినా ... పూర్తిచేయగలిగానన్న తృప్తి మాత్రం నాకు మిగిలింది.

ఇవన్నీ నా చెవిన పడుతున్నాయి. సమయం భారంగా గడుస్తోంది. ఉద్యోగ ధర్మంగా ఇక్కడికొచ్చాను. సాధారణంగా సెమినార్లు లాంటి వార్తలకు దినపత్రికల్లో పెద్దగా చోటు కల్పించరు. ప్రకటనలు బాగా ఇచ్చే సంస్థ కాబట్టి మా ఇన్ చార్చి స్వయంగా హాజరై చిన్న వార్త కవర్ చేయమని పంపాడు.

విలేకరి ఉద్యోగంలో కనుక ఇలాంటివి ఓపిగ్గా భరించాలి.

చేతిలో ఉన్న బ్రోచర్ ని పక్కన పడేసి నా చూపుని చుట్టుపక్కల సారించాను.

పదినిముషాల క్రితంతో పోలిస్తే పరిస్థితి మెరుగు. చాలా మటుకు ప్రాంగణం విద్యార్థినీ విద్యార్థులలతో నిండి ఉంది.

'' మీకు ఒక్క పని చేతకాదు... ఏది పట్టుకున్నా అంతే''

ఆడగొంతు వినపడటంతో చటుక్కున వెనక్కి తిరిగి చూశాను.

పక్కనే ఉన్న వ్యక్తిని ఆమె తూలనాడుతోంది. వారిద్దరూ భార్యభర్తలని క్షణాల్లో పోల్చుకోగలిగాను.ఆమె వదలకుండా మాట్లాడుతూనే ఉంది. ఆయన మౌనంగా వింటున్నాడు.“ అంత పరధ్యానమయితే ఎలా? పొద్దున వెళ్లేటప్పుడు చిలక్కి చెప్పినట్టుగా చెప్పాను కదా... ఒక్క విషయం గుర్తుండదు. పదే పదే చెప్పాలి” ఆమె పోరుతూనే ఉంది.

“ అన్ని మరిచిపోతారనే.. కాగితం పైన రాసికెళ్లమన్నా గదా.. అదీ మరిచిపోయారు. మీ మతిమరుపుతో చస్తున్నాను.”“ఈ వయసులో మొగుడు పెళ్లాలు.. ఇంటిదగ్గర కొట్టుకోక.. ఈ సెమినార్ దాకా రావటం దేనికో?” మనసులోనే విసుక్కున్నాను.వాళ్లని చూడగానే రిటైరయిన వ్యక్తులనిపించింది.

మైక్ లో పేరుపెట్టి పిలవగానే అతను హఠాత్తుగా ఆయన లేచినిలబడ్డాడు.

బట్టతల... టక్ చేసుకుని ఉన్నాడు.

ఆయన ఎర్రటి శరీరం .. ఆర్క్ లైటు వెలుగులో మెరుస్తోంది.“వయసులో ఉన్నప్పుడు బాగా అందగాడయ్యుంటాడు. ” అనుకోకుండా ఉండలేకపోయాను.

ఆయన డయాస్ వైపు నడుస్తుంటే .. ఆయన పరిచయాన్ని మైక్ లో చదువుతున్నారు.

“ప్రొఫెసరు భరద్వాజ... దేశం గర్వించవలసిన విద్యాధికుడు. ఇప్పటికి 18 డాక్టరేట్లు చేశారు. పరిశోధన పత్రాలు లెక్కలేనన్ని సమర్పించారు. దేశంలో ఏమూల సెమినార్ జరిగినా ఆయన హాజరు కావలసిందే. పత్రం సమర్పించవలసిందే అంటే అతిశయోక్తికాదు. రిటైరయి ఇన్నేళ్లయినా ఆయన చదవటం మానలేదు. రాయటం అంత కంటే మానలేదు. పద్దెనిమిది గంటలు నేటికీ పనిచేస్తున్నారు. ఇప్పటి విద్యార్థితరం ఆయనను చూసి నేర్చుకోవలసిన విషయాలెన్నో ఉన్నాయి.

భారత ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విద్యాసంస్కరణలో కమిటీలో ఆయనను సభ్యునిగా ఎంపిక చేశారు. ఉన్నత విద్యారంగంలో మార్పులకు సంబంధించి ఆయన చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవటం మనందరికీ గర్వకారణం. ముఖ్యంగా ఈ యూనివర్సిటీ ఖ్యాతిని ఆయన మరింత పెంచారు. అందుకే ఆయనను సన్మానించుకుంటున్నాం”.

భరద్వాజ వేదిక ఎడమవైపున్న సీట్లో ఒదిగి కూర్చున్నాడు.

పక్కనే యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, కేంద్రమంత్రి, ఢిల్లీ లాబీయింగ్ తో గౌరవడాక్టరేట్ పట్టేసిన ఓ విద్యాసంస్థ ఛైర్మన్, ఓ పత్రికాధిపతి..ఓపికకు పరీక్ష పెట్టే ప్రసంగాలతో పని లేకుండానే ప్రారంభకార్యక్రమాన్ని ముగించారు. సెమినార్లో ఎవరెవరు పాల్గొంటున్నారో వివరాలన్నీ నా దగ్గరున్న నోట్ ప్యాడ్లో నమోదు చేసుకున్నాను.

" అబ్బబ్బ.. అంత పెద్ద సన్మానం జరుగుతుంటే తలొంచుకుని కూర్చుంటారే.. ఏదో తప్పుచేసిన వాడిలా...

టీవీ కెమెరాలు చుట్టూ ఉన్నాయి. లైవ్ టెలికాస్టు అని మీకు తెలీదా..

నాలుగ్గోడల మధ్య ఏదో గీక్కుంటే ఎవరికి తెలుస్తారు? ఇలాంటప్పుడే గొప్పగా ఉండాలి..." ఆమె ఏదేదో చెబుతోంది.భరద్వాజ డయాస్ మీద నుంచి వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు. భార్య మాటలకి ఏ మాత్రం నొచ్చుకుంటున్నట్టులేదు. ఇదంతా అలవాటయిన వ్యవహారమైనట్టు చూస్తున్నాడు.

"మీ కంటే మంత్రి గారే నయం.. బోలెడు విషయాలు మాట్లాడాడు. టీవీ అంతా ఆయనే కనిపించాడు. వీసీ చెప్పింది చెత్తయినా..."ఆమె ఏదేదో చెబుతోంది.

నాకక్కడ ఉండాలనిపించలేదు. సీట్లో నుంచి లేచాను.భరద్వాజవైపు చూస్తూ అనుకున్నాను."ఇంతటి మేధావి. పేరు ప్రఖ్యాతులు గడించిన వాడు.. ఇంట మాత్రం గెలవలేకపోయాడు" నిట్టూరుస్తూ అనుకున్నాను.

అతన్ని నెత్తిమీద పెట్టుకోవలసిన ఇల్లాలు అడుగడుగునా ఆడిపోసుకోవటం.. చిన్న చితకా విషయాలకు నిష్ఠూరాలాడటం..ఎందుకో తెలీదు.. నా మనసును గాయపరిచింది. ఆయన పట్ల తెలియని సానుభూతి కలిగింది.

"ఈ దేశంలో విద్యావంతులందరి పరిస్థితే ఇంచుమించుగా అదేనేమో.." మరికాసేపట్లో సెమినార్ ప్రారంభమవుతుందని మైక్ లో చెబుతున్నారు.

నేను బయటికి నడిచాను...భరద్వాజకు మనసులోనే నమస్కారాలు చెప్పుకుంటూ...




ఆరోజు పన్నెండేళ్ళ రాజు పుట్టిన రోజు.

రంగు రంగుల రిబ్బన్ లతో, బెలూన్లతో అలంకరించిన హాల్ బంధుమిత్రులు, రాజు స్నేహితులతో నిండి వుంది.

సాయంకాలం చాక్లెట్లతో, పళ్ళతో అలంకరించిన టేబుల్ మీద బర్త్ డే విష్ రాసిన అందమైన పెద్ద కేక్ ముందు నుంచుని వున్నాడు రాజు. ఇరువైపులా అతని తల్లిదండ్రులు వున్నారు.

'కేక్ ఎప్పుడు కట్ చేస్తాడా, ఎప్పుడు అతన్ని ఆశీర్వదించాలా' అని పెద్దలు, 'నోరూరించే పదార్థాలు ఎప్పుడు తినొచ్చాని' పిల్లలూ ఎదురుచూస్తున్నారు.

అనుకున్న సమయం రానేవచ్చింది.

రాజు కేక్ కట్ చేశాడు. అందరూ"హ్యాపి బర్త్ డే టూ యూ, రాజు! మే గాడ్ బ్లెస్ యు" అని రాగయుక్తంగా పాడారు.

రాజు ఆనందంగా కేక్ కట్ చేశాడు. తల్లీ, తండ్రి రాజు తలపై అక్షతలు వేసి ఆశీర్వదించి కేక్ ముక్కలు అతని నోట్లో పెట్టారు. వచ్చిన వాళ్ళందరూ రాజుకి గిఫ్ట్స్ ఇచ్చారు.

రాజు తల్లి అందంగా పేర్చిన కేక్ ముక్కలు, చాక్లెట్లు వున్న పేపర్ ప్లేట్లను, కూల్ డ్రింక్ గ్లాస్ లను ట్రే లో సర్ది ఇవ్వగా, అవి అందుకుని అందరికి వినమ్రతగా అందించాడు రాజు.

ఆ తర్వాత సగం కేకును ఒక పాలిథీన్ బ్యాగులో సర్దుకుని, తనకొచ్చిన గిఫ్ట్స్ ని మరో బ్యాగులో వేసుకుని తన సైకిల్ మీద ఎక్కడికో వెళ్ళిపోయాడు.

అది అతని తల్లిదండ్రులతో పాటు అక్కడున్న వారినందరినీ ఆశ్చర్యపరచింది.

ముప్పావుగంట తర్వాత వచ్చిన రాజుని వాళ్ళ నాన్న "ఎక్కడికెళ్ళావు రాజూ?" అని ప్రేమగా అడిగాడు.

"డాడీ మరే, మన కాలనీకి ముందు కొంతమంది గుడిసెల్లో వుంటున్నారు కదా! పాపం వాళ్లకి బర్త్ డే సెలబ్రేషన్ వుండదు, కేక్ కట్ చేయరు. అందుకని వాళ్లకి కేక్ ఇచ్చి, ఆడుకోవడానికి గిఫ్ట్స్ ఇచ్చి వచ్చాను. నేనెలాగూ అన్నింటితో ఆడుకోను. వాళ్ళు ఎంత హాప్పీగా ఫీల్ అయ్యారో తెలుసా?"అన్నాడు సంతోషంగా!

వాడి పెద్ద మనసుకి అందరూ ఎంతో ముచ్చటపడ్డారు. అలాంటి పిల్లవాణ్ణి కన్నందుకు రాజు తల్లిదండ్రుల్ని అందరూ మెచ్చుకున్నారు.ఆ ఫంక్షన్ కి వచ్చిన పిల్లలు, ఇహ నుండి తమ పుట్టినరోజు కూడా రాజు లాగానే అందరి మన్ననలు అందుకునేలా జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

***

చూశారా, పిల్లలూ! పువ్వు పుట్టగానే పరిమళించడమంటే అదే! చిన్న వయసులోనే మంచితనంతో, సంస్కారంతో

‘మనుషులందరూ సమానమే’ అని రాజు చాటాడు. అందరి అభినందనలూ అందుకున్నాడు. అలాగే మీరూ మీ పుట్టినరోజును అనాధ శరణాలయాల్లో, వృద్ధుల శరణాలయల్లో జరుపుకుని మీకు తోచినంత సహాయం చేసి వాళ్ల అభినందనలూ, ఆశీర్వచనాలు అందుకుంటారు కదూ.




" శ్రావణీ...శ్రావణీ..." అని గట్టిగా భార్యను పిలుస్తూ వీధి గుమ్మం లోనుంచి హాల్లోకి వచ్చాడు ఆనంద్.

వంట పనిలో బిజీగా వున్న శ్రావణి, " అబ్బబ్బ..ఏంటండీ ఆ గావుకేకలు ఏవో కొంపలంటుకుంటున్నట్టు...అంటూ నాప్ కిన్ తో చేతులు తుడుచుకుంటూ గబగబా ముందుగదిలోకి వచ్చింది.

" అయినా ఈ వేళప్పుడు ఇంటికి వచ్చారేంటీ? " ప్రొద్దుట తను సిద్ధం చేసినలంచ్ క్యారియర్ భర్త చేతిలో చూస్తూ అంది శ్రావణి.

" పర్మిషన్ అడిగి వచ్చాలే..సిటీలో పనుండి...అద్సరే, ఇంతకీ అమ్మ ఏదీ? కనబడదే?? " చుట్టూ చూస్తూ అడిగాడు ఆనంద్.

" కనిపించకపోవడానికి ఆవిడేమన్నా నల్లపూసా? ఇప్పుడె తన ఫ్రెండ్స్ ని కలవటానికి వెళ్ళారు" ఒకింత చిరాగ్గా అంది శ్రావణి.

" ఎవరా ఫ్రెండ్...? అనసూయ ఆంటీనా..శారద ఆంటీనా " ఆరా తీసాడు ఆనంద్.

" ఆ(..వాళ్ళెవరూ కాదులెండి. ఇప్పుడు మీ అమ్మగారికి " ఫేస్ బుక్ " ఫ్రెండ్స్ ఎక్కువ అయ్యారుగా..ఆవిడెవరో వనజ గారట..ఏదో పనిమీద ఆవిడ విజయవాడ నుండి మన వూరు వస్తున్నారట..ఆవిడ్ని రిసీవ్ చేస్కుని ఇంటికి భోజనానికి తీసుకురావటానికి వెళ్ళారు. .అదిగో... ఇందాకట్నుంచి ఆ పన్లోనే ఉన్నాను..." విసుగ్గా అంది.

" అయితే నేను చూసింది అమ్మనేనన్నమాట..."స్వగతంగా అనుకుంటూ పైకే అనేశాడు..." ఎవర్నినడీ చూశానంటున్నారు? " అనడిగింది శ్రావణి.

" ఆఫీస్ నుంచి బైక్ మీద వస్తూంటే బస్టాపు దగ్గర్లో లెగ్గిన్, టాప్ వేసుకున్న నడివయసు పెద్దావిడ ఒకామే కంపించింది..అచ్చం ఆవిడ అమ్మలా అంపిస్తే అమ్మేనా, కాదా అన్న సందేహంతో, బండి స్లో చేసి మరీ చూశాను...అచ్చం అమ్మలాగానే వుందికానీ ఆమె వస్త్రధారణ చూసి అమ్మకాదేమో అనుకున్నాడు. అందుకే వచ్చీరాగానే అమ్మ ఏదీ అని అడిగాడు "ఒక్కనిముషం...ఇప్పుడే వస్తాను అని గబగబా బెడ్ రూం లోకి వెళ్ళిన శ్రావణి రెండు నిముషాల్లో తిరిగి వచ్చింది.

" నిజమేనండీ ! నిన్ననే ఇస్త్రీ అబ్బాయి తెచ్చిన బట్టలన్నీ బెడ్ రూం టేబుల్ మీద పెట్టాను. వాటిలో నా టాప్ కనిపించట్లేదు. వంటగదిలో వుండటాన అత్తగారు వెళ్ళేటప్పుడు నేను ఆవిడ్ని గమనించలేదు. " అంది.

మౌనం వహించాడు ఆనంద్.

" చ...చ...మరీ చిత్రంగా ప్రవర్తిస్తున్నారు మీ అమ్మగారు ఎప్పుడూ లేని క్రొత్త అలవాట్లు ఏంటో....? అయినా మావయ్యగారు పోయి ఆరునెలలైనా కాలేదు. ఈవిడిలా ప్రవర్తించడం ఏమన్నా బాగుందా...?"భర్తని ప్రశ్నించింది. " పోనీలే శ్రావణీ..అయినా ఇదంతా నీ చలవే కదా ! వదిలేయ్...." అన్నాడు ఆనంద్.

" అదేంటండీ అలా అంటారు....మావగారు పోయినప్పట్నుంచి ఆ బాధ తట్టుకోలేక ఒంటరితనంతో ..ఆలోచనలతో దిగులుగా వుంటున్నారు కదా అని కంప్యూటర్ నేర్పించి...ఇంగ్లీషు అక్షరాలు ఎలా టైప్ చేయాలో చెప్పి ఫేస్ బుక్ అకౌంట్ ఓపెన్ చేసి కొంతమంది ఫ్రెండ్స్ ని పరిచయం చేశాను. అయితే ఇలా వుండమని నేను చెప్పానా ?" ఆశ్చర్యంగా అడిగింది శ్రావణి.

" లైట్ తీసుకో ప్లీజ్ అమ్మ గురించి తక్కువ చేసి మాట్లాడవద్దు. నాముందు....నిన్నా మొన్నటిదాకా చాలా స్తబ్దుగా అన్నీ పోగొట్టుకున్నట్టు వుందికదా, కాస్త డైవర్ట్ అయ్యి వుంటుందిలే....అదీ ఒకందుకు మంచిదేలే ! ఇక తన డ్రెసింగ్ గురించి అంటావా...నేను సమయం చూసి నిదానంగా చెప్తాలే..." అని భర్త బ్రతిమిలాడుతున్నట్టు మాట్లాడడంతో కన్విన్స్ అయ్యింది శ్రావణి.

నిజానికి అత్తగారు ఎప్పుడూ తన లిమిట్స్ దాటేలా వుండరు. ఆలోచనలో పడింది శ్రావణి.

అసలు వాళ్ళింట్లో అందరి ఇళ్ళమాదిరిగా అత్తాకోడళ్ళ లాగా కాక..తల్లీకూతుళ్ళ లాగా కాక తల్లీకూతుళ్ళలాగా వుండేవారు. కానీ, అనుకోకుండా హార్ట్ ఎటాక్ రావడంతో అకాలమరణం చెందాడు ఆనంద్ తండ్రయిన రాఘవరాం.

అప్పట్నుంచి షాక్ తగిలినట్లుగా అచేతనంగా వుండిపోయింది భవాని. ముప్పై అయిదేళ్ళ కాపురంలో ఎప్పుడూ భర్తని విడిచిపెట్టి వుండని ఆమెకు కోలుకోలేని దెబ్బ అది.

రెండు నెలలపాటు పూర్తిగా మౌనం వహించింది. అస్సలెవ్వరితోనూ మాట్లాడలేదు. అన్నం పెడితే తినేది, లేదంటే లేదు. ఎప్పుడూ శూన్యంలోకి పిచ్చిచూపులు చూస్తూ కూర్చునేది.

ప్రాణానికి ప్రాణమయిన మనవడు, మనవరాళ్ళ ప్రేమకూడా ఆమెను కదిలించలేకపోయింది.

ఆమెను మామూలు మనిషిని చేయటానికి అందరూ రకరకాల ప్రయత్నాలు చేసేవారు.

శ్రావణికి అత్తగారంటే ఎంతో ఇష్టం. తను కడుపుతో వుండగా రకరకాల వంటలు చేసి దగ్గర కూర్చుని మరీ తినిపించేది. పిల్లల పెంపకంలో కూడా ఎంతో సాయం చేసిన అత్తగారు అల్లా కృంగిపోవడం చూసి తట్టుకోలేక ఆమెను చిన్నపిల్లలా చూసుకునేది.

రెండునెలల తర్వాత కొద్దిగా అత్తగారు తేరుకున్నాక ఆమెకు కంప్యూటర్ ఆపరేట్ చెయ్యడం నేర్పించి ఫేస్ బుక్ క్రియేట్ చేసి ఎలా

మెస్సేజ్ చెయ్యాలో టైప్ చెయ్యాలో క్షుణ్ణంగా నేర్పింది.

టీవీలో మిస్సయిన సీరియల్స్ ని యూట్యూబ్ లో చూసేలా చేసింది. అన్నిటికంటే ఫేస్ బుక్ భవానిని ఎక్కువ ప్రభావితం చేసింది. తన వయసు వాళ్ళయిన ఎంతోమంది ఆమెకు నేస్తాలయ్యారు. ప్రతీరోజూ గుడ్ మార్నింగ్ గుడ్ నైట్ మెస్సేజ్ లు చెయ్యటమూ ఫ్రెండ్స్ అందరితో చాటింగ్ ద్వారా ఎంతో రిలీఫ్ పొందేది.

కాకపోతే ఫేస్ బుక్ అడిక్ట్ అయ్యిందాని చూసేవారికి అంపించేలా ఫేస్ బుక్ స్నేహితులను కలవడానికి ఎక్కడికైనా వెళ్ళటమూ, అలాగే వాళ్ళనందరినీ యింటికి ఆహ్వానించి అతిథి మర్యాదలు చేయటంతో పని ఎక్కువైనందున కొంచం కోపం వచ్చింది శ్రావణికి కేవలం చాటింగ్ కే పరిమితమై వుండొచ్చుకదా అందర్నీ డైరక్టుగా కలవాల్సిన అవసరం ఏముందీ ..అని శ్రావణి భావన

***********

గంట తర్వాత ఆటోలో వచ్చారు భవాని, ఆమె ఫేస్ బుక్ నేస్తమైన వనజ ఇద్దరూ...

కోపం పైకి కంపించకుండా..ముఖానికి నవ్వు పులుముకుని వాళ్ళిద్దరికీ భోజనం వడ్డించింది శ్రావణి.

ఆ వచ్చినావిడకి కూడా అత్తగారి వయసే ఉంటుంది. చాలా పోష్ గా వుంది. ఖరీదైన టాప్ వేసుకుంది. అత్తగారు కూడా బానే ఉన్నారు ఈ డ్రెస్ లో...అని మనసులో అనుకోకుండా ఉండలేకపోయింది శ్రావణి.

ఆ తర్వాత అత్తగారూ, ఆ వచ్చినావిడ ఇద్దరూ చాలాసేపు అత్తగారి గదిలో కూర్చుని ఏమేమో మాట్లాడుకున్నారు.

అత్తగారు రకరకాల పేపర్స్ మీద..డాక్యుమెంట్స్ మీద సంతకాలు చెయ్యటం గమనించింది శ్రావణి.

ఏదో కీడు శంకించింది శ్రావణికి. ఆస్థి మొత్తం అత్తగారి పేరునే వుంది. కొంపదీసి ఈవిడ తమని సంప్రదించకుండా ఏమైనా దానధర్మాలు చేస్తుందా? అనే అనుమానం కూడా వచ్చింది.

కానీ అడగడం మర్యాద కాదుకదా అని సైలెంటుగా చూస్తూ కూర్చుంది.

సాయంత్రం అయిదింటికి స్నాక్సూ, టీ తీసుకున్నాక, ఆ వచ్చినావిడ బయల్దేరింది. ఆవిడను బస్ ఎక్కించి వస్తానని అత్తగారు కూడా ఆమె వెంట వెళ్ళింది.

వాళ్ళు వెళ్ళాక ఆత్రుత ఆపుకోలేక తప్పని తెలిసీ, అత్తగారి గదిలోకి వెళ్ళి అంతా వెతికింది.

అత్తగారు సంతకాలు చేసిన పేపర్స్ కనిపించాయి.

అవేమిటాని ఆసక్తిగా చదివిన శ్రావణి కళ్ళు చెమర్చాయి. అత్తగారంటే ఆమెకి ఉన్న గౌరవం రెట్టింపయ్యింది. అత్తగారి గురించి అపోహ పడ్డందుకు తనని తానే తిట్టుకుంది. గబగబా అవన్నీ ఎక్కడివక్కడ సర్దేసింది.

ఇంతకీ ....

ఆ వచ్చిన వనజ గారు ఎవరో కాదు " మరణించాక కూడా జీవించండి " అనే నినాదంతో ఏర్పాటైనశరీర అవయవ దాతల తాలూకు సభ్యురాలు.

అత్తగారు, తను మరణించాక తన శరీరంలోని ఉపయోగపడే అవయవాలు అన్నీ దానం చేసేందుకు అంగీకారం తెలిపి తను సంతకాలు పెట్టిన పేపర్సూ..డాక్యుమెంట్లూ ఉన్నాయక్కడ.

పాపం...భర్త మరణం తట్టుకోలేక ఇంచుమించు తనుకూడా మరణం అంచులవరకూ వెళ్ళి జీవితంతో పోరాడి ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా కోలుకుంటున్న అత్తగారు...సరదాపడి, లేని ఓపిక తెచ్చుకుని తన స్నేహితులను కలుస్తున్నందుకు సంతోషించాల్సింది పోయి, అదేదో పేద్ద తప్పన్నట్లు ఫీలయినందుకు పశ్చాత్తప పడింది శ్రావణి.

" నా జీవితం మోడు అయిపోయింది....అని ఒక మూలన కూర్చుని ఏడుస్తూ మిగతావారికి మనశ్శాంతి లేకుండా చేసే ఎంతోమందితో పోల్చితే తన అత్తగారు ఎంతో బెటరనిపించిందామెకు.

తను హుషారుగా ఉంటూ తనకు నచ్చిన బట్టలు వేసుకుని తనకి నచ్చినట్టుగా జీవించడం ఆమె ప్రాధమిక హక్కు....ఆవిషయంలో ఆవిడను తప్పు పట్టడమూ....ఆంక్షలు విధించడమూ చాలా తప్పని అర్థం చేసుకుంది.....

ఇంటికి తిరిగి వచ్చిన అత్తగారు " అమ్మా శ్రావణీ..నన్ను క్షమించమ్మా....నా ఫ్రెండ్సందరూ టాప్స్ వేసుకోవడంతో నాకూ వేసుకోవాలనిపించింది...నిన్ను పర్మిషన్ అడక్కుండా నీ టాప్ వేసుకున్నాను." అనగానే...

" దాందేముంది అత్తయ్యా..నేను మీ చీరలు కట్టుకోనా ఏంటి...అయినా నన్ను అడగాల్సిన అవసరం ఏమీ లేదు. అసలు ఇకపై మనమిద్దరమూ షాపింగ్ చేసి క్రొత్త మోడల్ డ్రస్సెస్ తెచ్చుకుందాం...సరేనా ! అంటున్న కోడలి వైపు ఆనందంగా చూసింది భవాని. అంతా చూస్తున్న ఆనంద్ " హమ్మయ్య! " అని ఊపిరి పీల్చుకున్నాడు...




బానుమామయ్య మా ఇంటికొస్తున్నాడు.

మా అమ్మ ఆనందం అంతా ఇంతా కాదు. వుండదూ మరి రక్తసంబంధమాయే. పైగా తోడపుట్టిన నలుగురిలో మిగిలింది వీళ్ళిద్దరే! అంతేకాకుండా మొదట్నుంచి అమ్మకి మామయ్య అంటే ప్రాణం. ఇంట్లో ఏ చిన్న ఆరోగ్య..అర్థిక సమస్య వచ్చినా మామయ్యకి తెలియాల్సిందే! ఆయన ఏ పరిష్కారం చూపించినా అది మర్యాదరామన్న తీర్పే..తు.చ. తప్పకుండా మా కుటుంబం పాటించాల్సిందే!

నా చిన్నప్పట్నుంచి రామాయణ..మహాభారతాల్లోని కథలెలా విన్నానో అలాగే మా అమ్మనోటివెంట మామయ్య సంగతులు వినేవాడిని! వాళ్ళిద్దరూ చిన్నప్పుడు ఎలా వుండేవారు..మామయ్య మా అమ్మ ఆడుకోవడం కోసం తెచ్చిచ్చే ఆటవస్తువులు..దగ్గరుండి చదివించడం.. ఎవరితోనన్నా  గొడవొస్తే తనని వెనకేసుకు రావడం అన్నీ పూస గుచ్చినట్టు చెప్పేది.

ఒకసారి ఆటల్లో మునగచెట్టు ఎక్కిన మా అమ్మ క్రింద పడిపోయి..ప్రాణం రెళ్ళపోతే చనిపోయిందనుకుని గుండెలు బాదుకున్నాడట. ఆ తర్వాత వైద్యుడు ఫరవాలేదని చెప్పి మూడు రోజులు వైద్యం చేస్తే పాఠశాలకి వెళ్ళడం మానుకుని అమ్మ పక్కనే కన్నీళ్ళతో కూర్చున్నాడట. మా అమ్మ కళ్లుతెరచి చిన్నగానవ్వంగానే ముందుగా ముత్యాలమ్మ గుడికెళ్ళి నూటొక్క టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నాడట. తోడబుట్టిన వాళ్ళలో మిగతా వారికన్నా వీళ్ళిద్దరి బంధమే ఆప్యాతానురాగాలతో ముడిపడివుండేదట. మా అమ్మకి పెళ్ళిచేస్తున్నారంటే బెంగపడిపోయాడట..తనని మా నాన్న దూరంగా తీసుకుపోతాడని. ఇంట్లోని అందరూ పదే పదే 'ఆడపిల్లకి పెళ్ళి తప్పనిసరి..పెళ్ళికొడుకు చాలా మంచివాడని' సర్ది చెప్పిన మీదట మనసు నెమ్మది చేసుకుని పెళ్ళికి అంగీకరించాడట.

పెళ్లై పట్నంలో కాపురం పెట్టాక కూడా చెల్లెలి కళ్లలో విచారఛాయలేమన్నా కన్పిస్తాయేమోనని పదే పదే వచ్చి చూసేవాడట..గుచ్చి గుచ్చి అడిగేవాడట. మా అమ్మ అదృష్టం ఏమిటంటే మా నాన్న కూడా చాలా మంచివాడవడం. అందుకే మా అమ్మని అభిమానించినంతగా మా నాన్నని అభిమానించి గౌరవించడం మొదలెట్టాడట.

మా మామయ్యకి ప్రభుత్వ ఉద్యోగం వచ్చి దూరప్రాంతంలో వుండాల్సిరావడం, అప్పట్లో సెల్ ఫోన్లు అవి లేకపోవడంతో ఉత్తరాలతో క్షేమ సమాచారాలు తెలుసుకోవడం చేసేవాడట. ఆ తర్వాత తనకి పెళ్ళై మరిన్ని బాధ్యతలు ఎక్కువవడంతో రాకపోకలు తగ్గాయి కాని అప్పుడప్పుడు పండగలూ.. పబ్బాలూ.. శుభకార్యాల్లో కలిస్తే మాత్రం అమ్మమీద బోలెడంత ఆప్యాయత కురిపించేవాడు. అమ్మా అంతే!నాకైతే మామయ్య ఆహార్యం చూస్తే బెరుకుగా అనిపించేది. నిజానికి అమ్మముందు పసివాడయ్యే వాడు గాని బయట మాత్రం స్ఫురద్రూపంతో గంభీరంగా వుండేవాడు. అందుచేత నా కెందుకో మావయ్యని చూస్తే అకారణంగా తిడతాడని భయం వేసేది. తనని తప్పించుకు తిరిగేవాడిని. నన్ను ఎప్పుడన్నా ముద్దు చేయడానికి దగ్గరకి తీసుకున్నా ముళ్ళ మీద కూర్చున్నట్టుగా ఆయన ఒళ్ళో కూర్చుని వదలంగానే తుర్రున బయటకి పరిగెత్తే వాడిని. నా తొమ్మిదో తరగతిలో అనుకుంటా నాకు పచ్చకామెర్లు వచ్చి ముదిరితే.. అమ్మ ఏడుస్తు నన్ను కాపాడమని మామయ్యా వాళ్ళింటికే తీసుకెళ్ళింది. మామయ్య వైద్యం చేయించి నన్ను భద్రంగా మా అమ్మకి అప్పజెప్పాడు. ఇంటికి రాగానే 'మా అన్నయ్య వుండగా నాకందుకే

భయం వెయ్యదు. వాడు మన కోసం యముడితో నైనా పోరాడుతాడు' అంది నాన్నతో.

మామయ్యకి ఇద్దరు మగపిల్లలు..ఒక్కతే ఆడపిల్ల. దాన్ని నాకిచ్చి పెళ్ళి చేయాలని ఒకటే తపన పడేవాడు. నా మరదలు ఓ మోస్తరు అందమైనది! తెలివైనది కూడా! నా కన్నా ఒక్క క్లాసు తక్కువ దానిది. మా చుట్టాలందర్లో చదువులో నాతో పోటాపోటీగా చదివి మంచి మార్కులు తెచ్చుకునేది. నేను మాత్రం దానిని పెళ్ళి చేసుకోననేవాడిని. ఎందుకంటే, ఎనిమిదో తరగతిలో మా సైన్స్ మాష్టారు మేనరికాలు చేసుకుంటే మానసిక ఎదుగుదలలేని..అంగవైకల్యం వున్న పిల్లలు పుట్టే అవకాశం చాలా ఎక్కువని చెప్పడంతో.. అది నా మనసులో బలంగా నాటుకుపోయింది. అంతే కాకుండా మా చుట్టాలలోనే మేనరికం చేసుకున్న వాళ్లకి మానసికవికలాంగుడైన పిల్లాడు పుట్టాడు. వాడితో వాళ్ళు క్షణ క్షణం అనుభవించిన నరకం కళ్లారా చూశాను. దాంతో మనసు వికలమై మరదలితో పెళ్ళికి 'ససెమిరా' అన్నాను. మామయ్య చేసేదేం లేక తన కూతుర్ని ఏ జి ఆఫీసులో పనిచేసే అబ్బాయికిచ్చి పెళ్ళి చేశాడు. ఆరోజు మా అమ్మ కొంగుతో మామయ్య కన్నీళ్ళు తుడుచుకుంటూ 'మన రక్త సంబంధం, బంధుత్వంగా మారుతుందని ఆశపడ్డానే..కానీ విధి నన్ను ఓడించింది' అనడం నాకిప్పటికీ గుర్తే!నేను రెండేళ్ళక్రితం భద్రాచలం పిల్ల వీణని చేసుకున్నాను. మా నాన్నగారు నా పెళ్లైన ఏడాదికి పరమపదించాడు. అమ్మని, మామయ్యని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. తర్వాతి సంవత్సరంలో పుట్టిన బాబుకి నాన్నపేరే పెట్టుకున్నాను.

కాలగమనంలో మామయ్య ఇద్దరు కొడుకుల్లో ఒకడు అమెరికాలో స్థిర పడిపోతే ఇంకొకడు ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రిటైరయ్యాక వాడిదగ్గరే మామయ్య వుండేది.

మధ్య మధ్యలో మామయ్య మా ఇంటికొచ్చి అమ్మని చూసి వెళుతుండేవాడు. అయితే ఈ మధ్య మామయ్యకి చాదస్తం బాగా పెరిగింది. అడపాదడపా మా ఇంటికి రావడమే కాకుండా..కుర్చీలో కూర్చుని తనకి కావలసిన పదార్ధాలు అమ్మచేతా మా ఆవిడచేతా ఆజమాయిషీ చేసి మరీ వండించుకు తింటున్నాడు. అదే నాకు నచ్చట్లేదు. మా ఆవిడకూడా ఈ విషయం నాతో రెండుమూడు సార్లు అంది. మామయ్యకి అమ్మంటే ప్రాణమే కాదనను..కానీ అమ్మకి ఓపిక వుండడం లేదు. అర్ధంచేసుకోవాలిగా!..అలా గొంతెమ్మ కోర్కెలు కోరితే మా ఆవిడ మాత్రం అప్పటికప్పుడు ఎలా చేయగలుగుతుంది? పెద్ద వాడిగా వచ్చి పెద్దమంతరహాగా వ్యవహరించి వెళ్ళిపోవాలి గానీ అలా సతాయిస్తే ఎంత చిరాగ్గా వుంటుంది ఎవరికైనా!

ఈ సారైనా అమ్మకి తెలియకుండా మామయ్యకి చెప్పెయ్యాలి ఆయనవల్ల మాకు ఎంత ఇబ్బంది అవుతూందో! ఎలా చెబితే బాగుంటుందో మనసులో రక రకాలుగా మననం చేసుకున్నాను.

మామయ్య వచ్చాడు.

అమ్మ ఆనందం షరామామూలే!

ఎప్పటిలాగానే తనకి నిమ్మకాయల పులిహోర తినాలనుందని, త్వరగా చేసి పెట్టమని ఆర్డరేశాడు. మా ఆవిడ నా వంక కొర కొర చూసింది. నాకూ చిరాగ్గానే వుంది మళ్ళీ మొదలెట్టాడని. అమ్మ మాత్రం 'ఒరే నాని, కాస్త బాగా రసముండే పెద్ద నిమ్మకాయలు తీసుకురారా, మామయ్య జిహ్వకి రుచిగా పులిహోర చేసి పెడదాం' అంది. ఇంక చేసేదేం లేక బైక్ బైటకి తీసి దగ్గరలో వున్న కూరగాయల షాపుకి వెళ్లాను. నిమ్మకాయలు లేవు. మూడు నాలుగు షాపులు తిరిగాను నిమ్మకాయలు కనిపించలేదు. నాకు అసహనం.. విసుగూ కలుగుతోంది. ఇంటికెళ్ళిపోదామనుకున్నాను..కానీ అమ్మ గుర్తుకొచ్చింది. మామయ్య తృప్తిగా తిని మెచ్చుకుంటే తనకి చాలా సంతోషం. మూడుకిలోమీటర్లదూరంలో వుండే మార్కెటుకి రయ్యిన పోనిచ్చాను బండిని. నా అదృష్టం. ఒక షాపులో వున్నాయి..కాకపోతే చిన్నవి. 'ఏవో ఒకటి దొరకడమే గొప్ప' అనుకుని తీసుకుని ఇంటికొచ్చాను.

మా అమ్మ ముఖం చాటంతయింది "నిమ్మకాయలు దొరకట్లేదు కదట్రా..పక్కింటి వనజ గారు చెప్పారు. నువ్వు తేవేమో అనుకున్నాను. .వాడి కోరిక తీరుతోంది.' అని నిమ్మకాయలు తీసుకుని కత్తిపీటతో కోసి రసం తీయడంలో మునిగిపోయింది. నాకు మాత్రం తెగ చిరాగ్గా వుంది. మూడు కిలోమీటర్ల దూరంలో వున్న మార్కెట్టుకి నిమ్మకాయల కోసం బైకుమీద వెళ్ళొచ్చే వెంగళాయిని నేను తప్ప ఇంకెవరూ ఉండరనిపించింది. వెళ్ళి నా గదిలో కూర్చుని టీ వీ చూడసాగాను. కొద్ది సేపటికి అమ్మ గదిలోకొచ్చి 'పులిహోర పూర్తయింది కాళ్లూ చేతులూ కడుక్కుని డైనింగ్ టేబుల్ దగ్గరకి వస్తే వడ్డన ప్రారంభిస్తానని' చెప్పింది. నేను వెళ్లేసరికి మామయ్య కూర్చుని వున్నాడు. అమ్మ వడ్డించింది. మామయ్య ఆవురావురు మంటూ లొట్టలేసుకుంటూ తింటున్నాడు. మధ్య మధ్యలో 'చిన్నీ(అమ్మకి మామయ్య పెట్టుకున్న ముద్దుపేరు) పులిహోర చెస్తే నువ్వేచెయ్యాలే! అచ్చం అమృతంలా వుందనుకో. పాడె మీదున్న వాడు కూడా దీని కమ్మటివాసనకి ప్రాణం పోసుకుని వచ్చేయాల్సిందేనే!' అన్నాడు. 'పొగడ్డూ మరి..నేను అంత దూరం వెళ్ళి నిమ్మకాయలు తెచ్చాను..అమ్మేమో ఒళ్ళు హూనం చేసుకుని క్షణాల్లో సిద్ధం చేసింది. మహారాజుగారు కదా, తిని ఆ మాత్రం ప్రశంసల జల్లులు కురిపించాల్సిందే!' మనసులో వెటకారంగా అనుకున్నాను.

మామయ్య రెండు రోజులున్నాడు చంటి పిల్లాడిలా 'అవి కావాలి ఇవికావాలి' అని చాలా విసిగించాడు.

ఈసారైనా తనవల్ల మేమెంత విసిగిపోతున్నామో నిర్మొహమాటంగా చెప్పెయ్యాలనుకున్నాను. ఎప్పుడూ మామయ్య తనే వచ్చి, వెళ్ళిపోతాడు. కానీ ఈసారి మొహమాటం లేకుండా కుండబద్దలుకొట్టాలి కాబట్టి నేనే రైల్వే స్టేషన్ కి తీసుకెళ్ళి రైలెక్కిస్తానన్నాను. దానికెంతో పొంగిపోయాడు.

నేనూ, మామయ్యా ప్లాట్ ఫాం మీద వున్న బెంచి మీద కూర్చుని రైలు బండి కోసం ఎదురుచుస్తున్నాం. బండి రావడానికి ఇంకా అరగంట వుంది. ఆయనతో విషయం ఎలా ప్రారంభించాలో మనస్సులో రక రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాను. ఇహ

మాటలుగా నోటినుండి వెలువడడమే తరువాయి.

అప్పుడు హటాత్తుగా నా వైపు తిరిగాడు మామయ్య. ఎప్పుడూ గంభీరంగా వుండే మామయ్య ముఖం సజలనయనాలతో చిన్నబోయివుంది..

' నానీ..మీ అమ్మంటే నాకు పంచప్రాణాల్రా..నువ్వంటే కూడానూ. పెద్దవాణ్ణయిపోయాక మావాళ్లకెవరికీ కాకుండాపోయాన్రా. మీ అత్తయ్య పైలోకంలో ఏదో కొంపలుమునిగే పనున్నట్టు ఆదరబాదరాగా నన్ను అనాధని చేసి పదేళ్ల క్రితం వెళ్ళిపోయింది. దాంతో నా అతీ గతీ పటించుకునే వాళ్ళు కరువైపోయార్రా! నాకు నచ్చేవి వదిలిపెట్టు, తిండికి కూడా మొహం వాచిపోతున్నాను. వృద్ధాప్యం శరీరానికొచ్చింది కాని జిహ్వకి రాలేదురా! అరటిచెట్టుని చూస్తే పువ్వు..దూట..కాయలతో చేసే కమ్మని కూరలు గుర్తొస్తాయి. పనసపొట్టుకూర..ఇంగువపోపుతో ఘుమ ఘుమలాడే పప్పు..ముక్కలపులుసు..పచ్చళ్ళూ గుర్తుకొచ్చినప్పుడు నోరూరుతుంది. కనీసం వాటిని తినకూడని రోగమొచ్చినా బాగుణ్ను నోరు కట్టుకునేవాణ్ణి..కానీ ఏ రోగం లేకుండా నిక్షేపంలా వున్నాను. ఇంట్లో నేనొకడిని వున్నానని పట్టించుకోని వాళ్ళు, ఇంక నాకోసం ఏం చేసి పెడతారు? చనిపోయినప్పుడు శ్రాద్ధ కర్మల్లో నాకిష్టమైనవి చేసి అందరికీ పెట్టడం కాదురా, నాకు..నాకు బ్రతికుండగా పెట్టాలి. పాపం మీ అమ్మ..నోరు తెరచి నేనేదడిగినా అప్పటికప్పుడు చేసి పెడుతుంది. అది నాకు తల్లిరా..తల్లి. ఆ తల్లిచేతుల్తో చేసినది తింటుంటే..అచ్చం మా అమ్మ నా చిన్నతనంలో వండి పెడుతున్నట్టే వుంటుందిరా..ఇలా మీ ఇంటికొచ్చి నాలుగు ముద్దలు తృప్తిగాతింటే..అది తలుచుకుంటూ కొన్నాళ్ళు హాయిగా..ప్రశాంతంగా గడపగలుగుతానురా..నాకు తెలుసు మిమ్మల్ని నేను ఎంతగా ఇబ్బంది పెడుతున్నానో..కాని నా ఆజమాయిషిని ఆనందంగా భరించే ఓర్పుని ఆ భగవంతుడు మీకిచ్చాడ్రా! ఒరే, నాలో శక్తి సన్నగిల్లుతోంది..రేపు నేను మంచాన పడవచ్చు..మీ ఇంటికి రాలేకపోనూవచ్చు..అప్పటివరకూ మీ ఇంటి తలుపులు నాకోసం తీసే వుంచండి. ఎప్పటికప్పుడు నీతో ఈ విషయాలు చెబుదామనే అనుకుంటాను..కాని ఏకాంతంలో నిన్ను కలిసే అవకాశమే రాదాయె! ఇవాళ దేవుడు మనని ఇలా కలిపి నా మనసులోని బరువుని దూరం చేశాడ్రా? మీరు పది కాలాలపాటు చల్లగా వుండాలి..అదిగో రైలుబండొస్తోంది..ఇవన్నీ చిన్నికి చెప్పకు..పాపం బాధపడుతుంది.."అన్నాడు.

నా కళ్లలో ఆపుదామనుకున్నా కన్నీళ్ళగడంలేదు. కొద్ది సేపటి క్రితం వరకూ ఎంత అధమంగా ఆలోచించాను? నైతికంగా ఎంత పతనమయ్యాను? తల్చుకుంటుంటే గుండె కోతకి గురవుతోంది. మామయ్య కాళ్లకి దణ్ణం పెట్టి 'మామయ్యా..అది నీ ఇల్లే! నువ్వెప్పుడు కావలిస్తే అప్పుడు రావచ్చు. కావాలంటే శాశ్వతంగా వుండిపోనూవచ్చు..తినాలనుకున్నవి అడిగి మరీ చేయించుకోవచ్చు నీకా స్వేచ్ఛ వుంది. నువ్వొస్తున్నావని తెలియజేస్తే నేనే స్టేషనుకి వస్తాను."అన్నాను డగ్గుత్తికతో.

"అలాగే లేరా? రాకుండా, మిమ్మల్ని చూడకుండా నేను వుండగలనా? మరి వస్తానే"అని రైలుబండి ఎక్కాడు.

నేను అక్కడే వున్న బెంచిమీద కూలబడిపోయి రైలుబండి వెళ్ళేవరకూ చూస్తూండిపోయాను మసకబారిన కళ్లతో.




అప్పుడే స్కూలు నుంచి వచ్చిన తరుణ్ .. పుస్తకాల బ్యాగును విసిరేసి పెద్దపెట్టున ఏడ్వటం ప్రారంభించాడు.

“అమ్మా ... నన్ను అందరూ గేలిచేస్తున్నారు. ఎవరూ పేరు పెట్టి పిలవటం లేదు. పొట్టోడా అంటారు. నాతో ఎవరూ స్నేహం చేయరు. దగ్గరకు వెళ్లినా తొలిగిపోతున్నారు.. ఇది నన్ను చాలా బాధపెడుతోంది. రేపట్నుంచి స్కూలుకు వెళ్లను.”
చీరకొంగుతో వాడి కన్నీళ్లు తుడిచి తలనిమురుతూ చెప్పింది.

“ కన్నా... మనల్నందర్నీ ఆ భగవంతుడే సృష్టించాడు. కొందరిని పేదవారిలా, మరికొందరిని డబ్బున్న వాళ్లలా...కొందరిని అందమైన వాళ్లలా.. ఇంకొందరిని అందవిహీనంగా...

అయితే పుట్టిన అందరికీ సమానమైన శక్తి సామర్థ్యాలిచ్చాడు. కష్టపడితే ఎవరయినా గెలుపును అందుకోవచ్చు.

నువ్వు బాగా చదువుకుని గొప్పవాడివయితే...

ఈ రోజు నిన్ను చూసి నవ్విన వాళ్లే .. నిన్ను పొగుడుతారు.

నీతో స్నేహం చేయటానికి ముందుకొస్తారు. పనిచేయటానికి భయపడే పిరికివాడు .. ఏడుస్తూ కూర్చునేవాడు... ఎప్పటికీ గెలవలేడు... గుర్తుంచుకో ''

తరుణ్ మనసులో ధైర్యాన్ని నూరిపోసింది.

'' అది కాదమ్మా... ఈ రోజు గ్రౌండ్ కెళ్లాను. అక్కడ క్రికెట్ సెలక్షన్లు జరుగుతున్నాయి. ఓ పక్కగా నిలబడి చూస్తున్నాను. అందరూ నన్ను ఆటపట్టించారు.

నీకిక్కడేం పనిరా.. కనీసం బంతి అందించటానికి కూడా పనికిరావు అని ఒకడంటే మిగిలిన వాళ్లంతా పగలబడి నవ్వారు. ఎగతాళిగా రోజూ ఏదొకటి అంటున్నారు. నేను స్కూలుకు ఎలా వెళ్లేది?''.

అప్పుడు అమ్మ అనునయంగా చెప్పింది.

'' నీకు లేని దాన్ని గురించి ఆలోచించకు. నీకున్న దానితో నువ్వేం చెయ్యగలవో ఆలోచించుకో. నిన్ను నువ్వు నిరూపించుకో... అందరితో శభాష్ అనిపించుకో. ఇలాంటివి నిన్ను బాధపెట్టని స్థాయికి చేరుకో''.

విజయం సాధించిన కొందరు వ్యక్తుల గురించి చెప్పటం మొదలుపెట్టింది. ఆ తర్వాత తెల్లవారుఝామున ఎప్పుడో వాడికి నిద్ర పట్టింది.ఆ రోజే కాదు.. తరుణ్ పడుకోబోయే ముందు ప్రతిరోజూ ఆమె ఇలాంటి కథలే చెప్పసాగింది.

కొన్నేళ్లు గడిచాయి.

తరుణ్ కొత్త ప్యాంటు, షర్టు తొడుక్కుని స్కూలు కొచ్చాడు.

ఆ రోజు స్కూలులో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రాంగణం అంతా విద్యుద్దీపాలతో కళకళలాడుతోంది.

వేదికపై ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితర పెద్దలు కూర్చున్నారు.

మైక్ లో పిలవగానే తరుణ్ ని కూడా తీసికెళ్లి వాళ్లపక్కన కూర్చోబెట్టారు.

" మన పాఠశాల విద్యార్థి పదోతరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సంపాదించిన విషయం మీ అందరికీ తెలుసు. ఆ విద్యార్థిని అభినందించటానికి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. అతన్ని ఆశీర్వదించటానికి ప్రముఖులు విచ్చేశారు. పెద్ద ఎత్తున బహుమతులు ప్రకటించారు. ఇదంతా మాకు గర్వకారణంగా ఉంది. " ప్రధానోపాధ్యాయుడు మాట్లాడటం ప్రారంభించగానే అందరి చూపు తరుణ్ వైపు మళ్లాయి.

" ఈ అబ్బాయి చదువు పూర్తయ్యే వరకూ అందుకయ్యే పూర్తి ఖర్చు మేమే భరిస్తాం. ఇంజనీరింగ్, మెడిసిన్, చార్టర్డ్ ఎక్కౌంటెన్సీ .. అతను ఏ రంగాన్ని ఎంచుకున్నా సరే... " పేరొందిన స్వచ్ఛంద సంస్థ వేదికపైకి వచ్చి ప్రకటించింది.

ఆడిటోరియంలో చప్పట్లు మారుమోగాయి.

మళ్లీ చప్పట్లు..

"తరుణ్ ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. క్యాంపు ఆఫీసుకు తీసుకురావలసిందిగా సూచించారు."

" తను ఇన్నాళ్లు పడిన శ్రమ వృథా కాలేదు. మట్టిముద్దను శిల్పంగా మార్చినట్టే బలహీనుడిగా అవమాన భారంతో తల్లడిల్లే

తన బిడ్డను తను తీర్చిదిద్దుకుంది. వింటినుంచి వదిలిన బాణంలా అతను లక్ష్యంవైపు దూసుకుపోతున్నాడు.'' తృప్తిగా అనుకుంది అమ్మ తరుణ్ వైపే చూస్తూ.

కారులో వెనక సీట్లో తరుణ్.. ఆ పక్కనే కూర్చుని ఉంది ఆమె. మరోనాలుగు కార్లు సీఎం క్యాంపు కార్యాలయం దిశగా సాగుతున్నాయి. వేదికపైన వక్తల ప్రసంగాలు, తన బిడ్డను ప్రశంసలతో ముంచెత్తటం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.'' అమ్మా.. నేను స్టీఫెన్ హాకింగ్ లా పెద్ద శాస్త్రవేత్తను అవుతా..'

నాల్రోజుల క్రితం వాడు చెప్పిన మాటలు పదేపదే గుర్తుకొచ్చాయి.

''వాడు నిజంగా గెలుస్తాడు. నాకా నమ్మకం ఉంది'' అనుకుంది దృఢంగా.

తరుణ్ కిటికీలో నుంచి బయటకు చూస్తు కూర్చున్నాడు.

అతని చూపుల్లో కొండంత ఆత్మవిశ్వాసం...

గెలవగలనన్న నిండైన నమ్మకం...

పోలియోతో చచ్చుబడిపోయిన అతని రెండు కాళ్లు సీటు పై నుంచి కిందకు వేలాడుతున్నాయి. దేన్నీ లెక్కచెయ్యనట్టుగా.




“మనం మనిషిగా ఆశించగలిగింది ఒకరికొకరం ఇచ్చిపుచ్చుకోగల అభిమానాన్ని మాత్రమే. మనకు మించిన భారాలను, దు:ఖాలను అధిగమించగల శక్తిని ఇచ్చే మానవీయ స్పర్శను మాత్రమే. మహా శిలలను అరగదీస్తే తులం బంగారం దక్కినట్టు మనం నమ్మగలిగే ఒక్క మానవ సంబంధం కోసం, మనదైన బంధం కోసం ఎన్ని ప్రయోగాలు చేస్తాం. అలాంటి వారు ఒక్కసారి మనల్ని మోసం చేస్తే...      అలా వాళ్ళు మన మనస్సులో చేసిన గాయాలను, మిగిల్చిపోయిన జ్ఞాపకాలను కన్నీటి చెలమలుగా మార్చుకొని పైకి సతతహరితారణ్యంలా పచ్చగా కనిపిస్తామే కానీ, అణువణువున నిప్పుల వర్షంలో తడిసిపోతున్న భావనతో అంతరంగంలో విషాదాన్ని మనకు మాత్రమే సొంతం చేసుకుంటాం.” అని ఎప్పుడో, ఎక్కడో చదివిన విషయాలు గుర్తుకొస్తు న్నాయి.

*****

నాకు బాగా జ్ఞాపకం

చిన్నప్పుడు బడికి వెళ్లాలంటే ఎంతగా ఏడిపించేవాడినో, ఎన్ని దెబ్బలు తినేవాడినో.

“దెబ్బలు కొట్టవద్దని అమ్మ”

“అడ్డు రావద్దని నాన్న”

“రారా బడికి వెళదాం” అని చెల్లి

ఇలా ప్రతిదీ నాకు జ్ఞాపకం. మొత్తం మీద బడికి వెళ్లే వాడిని. చెల్లి చెయ్యి పట్టుకొని. ఆశ్చర్యంగా ఉంది కదూ! అన్నయ్య చెల్లిని బడికి తీసుకువెళ్ళడం విని ఉంటారు కానీ చెల్లి అన్నయ్యను బడికి తీసుకువెళ్లడం ఇదే మొదటిసారి అనుకుంట మీరు వినడం. ఆ అదృష్టం నాకు మాత్రమే దక్కింది. అందుకేనేమో చిన్నప్పటినుంచి ఒకే క్లాస్ లో కూర్చుంటూ ఇంటర్ వరకూ వచ్చాం. చెల్లి లేకుండా ఒక్కరోజు కూడా బడికి వెళ్లలేదు, కాలేజ్ కి కూడా...

చిన్నప్పుడు నాన్న తెచ్చిన కొత్తపుస్తకాలు పంచుకోవడం, ఆ కొత్త వాసనలో మురిసిపోవడం, నెమలి ఈకలు తెచ్చి పుస్తకాలలో పెట్టి పిల్లలు పుట్టాయా?! లేదా?! అని ప్రతిరోజూ చూడటం ... ఇవన్నీ  నాకు జ్ఞాపకం. ఆశ్చర్యం చెల్లి పుస్తకంలో నెమలి ఈకలు తగ్గుతూ ఉండేవి కానీ నా పుస్తకంలో నెమలి ఈకలు పెరుగుతూ ఉండేవి. అది ఎలానో ఎదిగిన కొన్నేళ్లకు కానీ నాకు అర్థం కాలేదు.

మా ఇంట్లో ఓ ఐదు రూపాయల నాణెం ఉండేది. చాలా పెద్దగా, బరువుగా ఉండేది. దాని మీద ఇందిరాగాంధీ బొమ్మ కూడా ఉండేది. దానిని ఎన్ని సార్లు దొంగతనంగా తీసుకెళ్లి  చాక్లెట్లు, బిస్కెట్లు  కొనుక్కున్నామో... ఉదయం కొంటే మధ్యాహ్నం, మధ్యాహ్నం కొంటే సాయంత్రం, సాయంత్రం కొంటే  రాత్రి కల్లా ఆ నాణెం తిరిగి మా ఇంటికి వచ్చేది. ఎలా అంటే షావుకారు మా నాన్నకు స్నేహితుడు. వెంటనే విషయం తెలిసేది. నా వీపు విమానం మోత మ్రోగిపో యేది. చెల్లికి తిట్లాభిషేకం జరిగిపోయేది.

ఇలా ఎన్ని జ్ఞాపకాలు... ప్రతిక్షణం నన్ను వెంటాడుతూనే ఉన్నాయి.

*****

ఇంటర్ లోనే పెళ్లి చేస్తే నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయిన తను, ఇప్పుడు మేము తిరిగిన ప్రతిచోటా, మమ్మల్ని నేను అద్దంలో చూసుకున్నట్లు చూసుకునే ప్రతిచోటా జ్ఞాపకమై పలకరిస్తుంది. తనంటే నాకు ఎంత ఇష్టమంటే నా నిండా తనే నిండి ఉంది. నన్ను తనగా మార్చుకోకుండా, నన్ను నన్నుగా తనలోకి తీసుకున్నా  తను లేని నేను అర సున్నాలా, అర్థరహితంగా మిగిలిపోతున్నానేమో అనిపిస్తుంది. “పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళుతుంటే సూటికేస్ మీద మారిన ఇంటి పేరు చూసి ఒకరినొకరు వాటేసుకొని ఎంతగా  ఏడ్చామో... ఎంతమందిని ఏడిపించామో... మీకు తెలిస్తే” తనంటే నాకు ఎంత ఇష్టమో తెలుస్తుంది.

“ఒక మగాడికి భార్యగా, ఒక ఇంటికి కోడలిగా, స్వేచ్ఛను కోల్పోయిన చిన్నారి ముత్తైదువుగా ఉంటూ ఇంటికి వచ్చిన తన అన్నకు కనీస మర్యాద చేయడం కోసం చుట్టూ ఉన్న సంకెళ్ళను తెంచుకున్న తన తెగువ ఊహించగలిగితే” నేనంటే తనకు ఎంత ఇష్టమో తెలుస్తుంది.                    ఇవన్నీ మీతో పంచుకుంటుంటే తనకు నేను బాకీ పడిపోయిన సంగతి కూడా గుర్తుకు వస్తుంది. అది మీకు చెప్పాలనిపిస్తుంది. నెమలి ఈకల నుంచి, ప్రతి రాఖీకి నేను తనకు బాకీ పడుతూనే ఉన్నాను. తను నాకు రాఖీ కట్టే ప్రతిసారీ తన పెదాలపై నవ్వును చూస్తుంటే ... నాకు కూడా కనిపించని నాకళ్ళల్లోని కన్నీళ్లను తను చూసేది.రెప్ప దాటి బయట పడకముందే...      దేనికైనా టైమ్ రావాలిరా, ఆ టైమ్ వచ్చినప్పుడు వడ్డీతో సహా అన్నీ వసూలు చేసుకుంటాను లేరా అని ఓ నవ్వు నవ్వేసేది.

ఇప్పుడు నాకు ఉద్యోగం వచ్చింది. మంచి జీతం. తను వస్తే వడ్డీ కాదు, చక్రవడ్డీ, బారువడ్డీ అన్నీ కలిపి తన బాకీ తీర్చేయాలని ఉంది. కానీ తను రాదు, రాలేదు... ఎందుకంటే తను ఈలోకంలో లేదు.

*****

నా చెల్లెలు జ్యోతి.

జ్యోతి తను పేరుకు తగినట్టుగానే మా అందరికీ వెలుగు. ముఖ్యంగా నాకు. ఆ పేరే నను ముందుకు నడిపిస్తుం దనుకున్నాను. కానీ ఆపేరే నను గాఢాంధకారంలోకి నెట్టేస్తుందని ఏ రోజూ ఊహించలేదు. తన మీద నాకు చాలా కోపం.చెప్పకుండా వెళ్లిపోయిందని.అందుకే తను లేని చోట ఉండాలని ఉంది.కానీ ఎక్కడికి వెళ్ళినా తను ఒక జ్ఞాపకమై పలకరిస్తుంది.

తను అత్తారింటి నుంచి వస్తుందంటే చాలు బస్సు దిగిన దగ్గరనుంచి ఇంట్లో అడుగు పెట్టే వరకు మా వీధంతా ఒకటే సందడి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరిని పలకరిస్తుంది. తానూ పులకరిస్తుంది గోదారిలా గలగలా నవ్వుతూ వచ్చేది. ఆనవ్వు నాకు బాగా జ్ఞాపకం.

***

ఇలాంటి జ్ఞాపకాలు ఎన్నో నాకు మిగిల్చి తను మాత్రం అందనంత దూర తీరాలకు తను వెళ్లిపోయింది. నన్ను ఒంటరిగా వదిలేసి.'తను వద్దన్నా పదహారేళ్లకే పెళ్లి చేసిన జ్ఞాపకం'

'పద్దెనిమిదేళ్ళకే పాప పుట్టిన జ్ఞాపకం'

'ఇరవై ఏళ్లకే మరో పాప పుట్టిన జ్ఞాపకం'

'ఇరవై నాలుగేళ్లకే అందరినీ వదిలి, అన్నీ వదిలి నూరేళ్లూ నింపుకొని వెళ్ళిపోయిన జ్ఞాపకం'

"అప్పుడవన్నీ తీపిజ్ఞాపకాలు … ఇప్పుడవన్నీ చేదు జ్ఞాపకాలు…"

జ్యోతి…     ఎక్కడికి వెళ్ళిందో తెలుసు

ఎందుకు వెళ్ళిందో తెలుసు

ఎలా వెళ్ళిందో తెలుసు

అయినా ఏమీ చేయలేని నిస్సహాయత, తల్లిలేని పిల్లల్ని తండ్రి లేని పిల్లలుగా చూడకూడదన్న పెద్దవాళ్ళ దయార్ద్ర హృదయత మా చేతుల్ని కట్టిపడేశాయి. అయినా తప్పు మాది. ముఖ్యంగా నాది. వద్దన్నా… అన్నా , చిన్న వయసులోనే పెళ్లిచేసి సరిదిద్దుకోలేని తప్పుచేశాం. ఇటు శారీరకంగానూ, అటు మానసికంగాను ఎదగని పిల్లలకు పెళ్లి చేస్తే తన చుట్టూ ఉన్న పరిధిని విస్తృత దృక్పథంతో చూడలేరు. నవమాసాలు మోసినంత తేలికగా వారు కష్టాలు, కన్నీళ్లు మోయ లేరు. వారి ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని భంగపరచే సంఘటనలు     అత్తారింటిలో చోటుచేసుకుంటే తనను తాను సహాన పరచుకోలేరు. తమకు తాము సర్దిచెప్పుకోలేరు. ఫలితం ఈలోకం నుంచి కడతేరిపోవాలనుకుంటారు. నిందలేనిదే బొంది పోదంటారు. అలా ఏదో ఒక నిందతో…. కానీ అసలు     కారణాలు అలా అట్టడుగునే ఉండిపోతాయి.

*****

కంటికి రెప్పలా చూసుకునే కూతురు దూరమైతే ఒక తండ్రి పడే బాధ నా కళ్ళముందు కనిపిస్తుంది.

చిన్నప్పుడెప్పుడో బడిలో పంతులుగారు చెప్పిన పాఠం గుర్తుకు వస్తుంది. అమ్మను చూస్తుంటే... " కంసుడు కడుపులో ఉన్న పిండాన్ని ఖండఖండాలుగా నరికినపుడు ఆ తల్లి పడిన బాధకంటే మా అమ్మ పడుతున్న బాధ వెయ్యి రెట్లు ఎక్కువలా అనిపిస్తుంది." పేగు తెంచుకు పుట్టిన కూతురు ప్రేమ తుంచుకొని వెళ్లిపోతే... ఏ తల్లైనా ఎలా తట్టుకుం టుంది.

జ్యోతిని తలచుకొని నా ముందు ఏడిస్తే నేనూ ఏడుస్తానని అమ్మ, నాన్న...

అమ్మ, నాన్నల ముందు ఏడిస్తే వాళ్ళు ఏడుస్తారని నేను...

ఇలా నాకు తెలియకుండా వాళ్ళు, వాళ్ళకు తెలియకుండా నేను ఎన్ని నిద్రలేని రాత్రులను గడిపామో ... ఆనిద్ర లేని కళ్ళల్లో ఎప్పుడూ తనే. తనతో పాటు చదువుకున్న వాళ్ళు ఇంకా చదువుతూనే ఉన్నారు. కొంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు. కాని తను మాత్రం "జన్మాంతర ఋణమేదో తీర్చుకుపోవడానికి వచ్చినట్టు ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది." అందుకే ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేయకూడదు. వాళ్ళని పెళ్లి పేరుతో పరాయి వాళ్ళకు బానిసలుగా మార్చకూడదు. 'ఉద్యోగాలు చేస్తారా?, ఊళ్ళేలతారా?' అని వాళ్ళ కాళ్ళకు, చేతులకు సంకెళ్లు వేసి వారి అస్తిత్వాన్ని, అభివృద్ధిని మనం అనగద్రొక్కకూడదు. స్త్రీ సాధికారితా జిందాబాద్ అనేలా... వాళ్ళను ఎదగనివ్వండి. ఒక రాణీరుద్రమదేవిలా... ఒక ఇందిరా గాంధీలా... ఒక ప్రతిభాపాటిల్ లా... ఎదగనివ్వండి.

*****

క్షమించండి నాలో ఆవేశం కట్టలు తెంచుకుంటుంది. కాని మనిషికి ఆవేశమే కాదు ఆలోచన కూడా ఉండాలి. అదే ముఖ్యం. ఆ ఆలోచనే ఆ రోజు 'కత్తికన్నా కలం గొప్పది' అనే విషయాన్ని మా వాళ్లకి జ్యోతి గుర్తుచేసింది. ఏప్రిల్ 23, 2008న జ్యోతి వెళ్లిపోయింది. హైదారాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో యం.ఏ. తెలుగు ఫైనల్ ఇయర్ ఆఖరి పరీక్షకు హాజరవుతున్న నాకు చెప్పకుండా వెళ్లిపోయింది. ఒకరికోసం ఒకరం అన్నట్టుగా పెరిగాం. చివరకు ఒకరినొకరు చూసుకోకుండానే ... కడసారి చూపు కూడా నా కంటికి దక్కలేదు.

“చిన్న తనంలో పెళ్లి చేశానన్న      కోపం ఇలా తీర్చుకుంది. అందుకే ప్రస్తుతం నా జ్ఞాపకాలన్నీ జ్యోతిర్మయం.”